

ఆర్టీసీ బస్సు బీభత్సం

- ద్వారకా బస్ కాంప్లెక్స్‌లో ప్లాట్‌ఫారంపైకి దూసుకువెళ్లిన వాహనం
- ఒక మహిళ మృతి...మరొకరికి స్వల్పగాయాలు

ద్వారకా బస్‌కాంప్లెక్స్‌లో ఓ బస్సు ప్లాట్‌ఫారంపైకి దూసుకువెళ్లి ఒక మహిళను ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.



గేదెల ముత్యాలమ్మ (ఫైల్ ఫొటో)

..మెయిన్ 3లో

వర్షాభావం తీవ్రం

ఈ సీజన్‌లో ఇప్పటికి 38.9 శాతం లోటు

- జూన్‌లో 18.4 శాతం, జూలైలో 37.9 శాతం తక్కువ వర్షపాతం
- 72 రోజుల్లో సగటున 18 రోజులే వర్షం
- సాగని సాగు...రైతుల ఆందోళన
- భూగర్భ జలాలపైనా ప్రభావం
- అల్పపీడనంపైనే ఆశలు



పద్మనాభం మండలంలోని గంధవరం గ్రామంలో నాట్లు వేయకుండా ఉన్న పొలాలు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

నైరుతి రుతుపవనాల సీజన్‌లో జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు కురవాల్సిన సమయంలో ఎండలతో ప్రజలు మాడుతున్నారు. నగరంతోపాటు గ్రామీణ ప్రాంతంలో వర్షాభావంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రుతుపవనాల సీజన్‌లో జూన్ ఒకటో తేదీ నుంచి సోమవారం వరకూ 300.9 మి.మీ.కుగాను 184 (38.9 శాతం తక్కువ)మి.మీ. వర్షపాతం నమోదైంది. వర్షాభావంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతుంది.

జిల్లాలోని 11 మండలాల్లో ఈ సీజన్‌లో ఇప్పటివరకూ సగటున 18 రోజులే వర్షం కురిసింది. మే నెలలో జిల్లాలో 86.2 మి.మీ.కుగాను 107.7 మి.మీ. (25 శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. వర్షం జోరు జూన్ నెల ప్రవేశంతో మందగించింది. ఆ నెలలో చాలా రోజులు వర్షాలే లేవు. చివరి వారంలో వర్షాలు కురిశాయి. దీంతో జూన్ నెలలో 109.6 మి.మీ.కు గాను 89.03 మి.మీ. (సాధారణం కంటే 18.4 మి.మీ.లు) వర్షపాతం నమోదైంది. పద్మనాభం మండలంలో 43 శాతం, ములగాడలో 36 శాతం, సీతమ్మధారలో 28.5 శాతం తక్కువ నమోదు కావడంతో భూగర్భజలాలపై ఒత్తిడి పెరిగింది. ఈ నెలలో సగటున 12 రోజులే వర్షాలు కురిశాయి. వ్యవసాయ శాఖ అధికారుల చెప్పిన వివరాలు మేరకు ఒక ప్రాంతంలో ఒకరోజు 20 మి.మీ. వర్షం కురిస్తే దానిని ఒక వర్షపు రోజుగా పరిగణిస్తారు. అంటే దీనినే ఒక దుక్కి వర్షంగా/పదును వర్షంగా పిలుస్తారు.

జూన్ ఒకటోతేదీ నుంచి సోమవారం వరకు జిల్లాలో మండలాల వారీగా వర్షపాతం వివరాలు

మండలం	సాధారణ వర్షపాతం	కురిసిన వర్షపాతం	శాతం
పెందుర్తి	296.7	198.3	33.2
ఆనందపురం	298.7	198.9	33.4
పద్మనాభం	402.3	227.5	43.5
భీమునిపట్నం	300.5	179.6	40.2
విశాఖ రూరల్	273.5	166.4	39.2
సీతమ్మధార	300.1	171.4	42.9
పెదగంట్యాడ	294.7	199.3	32.4
గాజువాక	252.3	137.7	45.4
మహారాణిపేట	300.1	201.3	32.9
గోపాలపట్నం	296.7	156.4	47.3
ములగాడ	294.7	187.4	36.4
జిల్లా సగటు	300.9	184.0	38.9

జూలై నెలలో వర్షాభావం మరింత పెరిగింది. జూలైలో 139.8 మి.మీ.కు 86.83 మి.మీ. (సాధారణం కంటే 37.9 శాతం) వర్షపాతం కురిసింది. ఈ నెలలో కేవలం ఏడు రోజులు వర్షం రోజులుగా నమోదయ్యాయి. జూలైలో విశాఖ రూరల్‌లో 53.5, గాజువాకలో 45.5, పెందుర్తి, మహారాణిపేటలో 42.7, గోపాలపట్నంలో 41.9 శాతం తక్కువ నమోదైంది. ములగాడలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదుకాగా మిగిలిన మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. ఇక ఆగస్టు నెలలో సోమవారం వరకు మొత్తం 11 రోజుల్లో రెండు, మూడు రోజుల్లో కొన్ని ప్రాంతాలు తప్ప మిగిలిన రోజులు అసలు వర్షాలే లేవు. ఈనెల 8, 9 తేదీల్లో జిల్లాలో దాదాపు అన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిశాయి. అధికారిక లెక్కల మేరకు నైరుతి రుతుపవనాల సీజన్ ప్రారంభం నుంచి అంటే జూన్ ఒకటో తేదీ నుంచి సోమవారం

... మిగతా 8వ పేజీలో

ఆహార కల్తీ నియంత్రణకు

షీ టీమ్స్

హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల్లో నిరంతర తనిఖీలు

- ప్రతి జోన్‌కు రెండేసి బృందాలు
- 16 బృందాలు... 50 చోట్ల సోదాలు
- సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి కూడా చెక్
- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):



నగరంలో ఆహారకల్తీకి అడ్డుకట్ట వేయడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కోసం శానిటేషన్ అండ్ హెల్త్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (షీ) బృందాలను ఏర్పాటుచేసినట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్‌లు, బేకరీలు, వీధి ఆహార విక్రయ కేంద్రాల్లో ఆహారకల్తీ, నాణ్యత, పరిశుభ్రత లోపంపై తరచూ ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. నిల్వ ఆహారం, ఆరోగ్యానికి హాని కలిగించే రంగులను విచ్చలవిడిగా వినియోగించడం వల్ల దీర్ఘకాలిక రోగాలు దరిచేరుతున్నాయన్నారు. ఎప్పుడో ఒకసారి తనిఖీలు చేసి కేసులు నమోదుచేసి వదిలేయడం వల్ల వ్యాపారుల ధోరణిలో మార్పురావడం లేదన్నారు. ఈ నేపథ్యంలో ఆహారం విక్రయించే దుకాణాలు, హోటళ్లు, బేకరీలపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రతి జోన్‌కు రెండేసి షీ టీమ్స్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించామన్నారు. ఒక్కో బృందంలో సహాయ వైద్యాధికారితోపాటు శానిటేషన్ సూపర్‌వైజర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు ఉంటారన్నారు. ఒక్కో బృందం ప్రతీరోజూ రెండు, మూడు హోటళ్లు/రెస్టారెంట్‌లు/బేకరీలు/స్ట్రీట్‌ఫుడ్ సెంటర్లలో తనిఖీలు చేయాల్సి ఉంటుందన్నారు. దీని వల్ల నగరంలో

... మిగతా 6వ పేజీలో

ట్రాఫిక్‌లో పాతుకుపోయిన ఎస్‌ఐలు



నాలుగేళ్లు దాటినా కదలని వైనం

- విధి నిర్వహణలో ఇష్టారాజ్యం
- బదిలీ కాకుండా కొందరి పైరవీ
- మరికొందరు బదిలీ కోరుతున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగర ట్రాఫిక్ విభాగంలో కొందరు ఎస్‌ఐలు ఏళ్ల తరబడి పాతుకుపోయారు. రెండు,మూడేళ్లకు ఒకసారి బదిలీ కావాల్సి ఉన్నా...కొందరు నాలుగేళ్లు దాటినా కదలలేదు. ఈ క్రమంలో కొందరికి స్టేషన్ పరిధిలో వ్యాపారులతో మంచి పరిచయాలు ఏర్పడడం, సిబ్బందితో బాగా అనుబంధం ఏర్పడడం వంటి కారణాలతో సమర్థంగా విధి నిర్వహణ చేయలేకపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చాలాకాలంగా ఒకే స్టేషన్‌లో ఎస్‌ఐలు పనిచేస్తుండడంతో విధి నిర్వహణలో కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

నగరంలో వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ, తనిఖీలు, ట్రాఫిక్ నియంత్రణ కోసం 21 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వాటిలో ఏడు నోటిఫైడ్ స్టేషన్‌లు కాగా, మిగిలినవి అవసరాన్ని బట్టి తాత్కాలికంగా ఏర్పాటుచేసుకున్నవే. ఒక్కో స్టేషన్‌కు ఒక ఎస్‌ఐ ఉండగా, వారిపై పర్యవేక్షణ కోసం సబ్ డివిజన్‌కు ఒకరు చొప్పున సీఐలు ఉంటారు. 21 పోలీస్ స్టేషన్లలో ప్రస్తుతం మూడు, నాలుగు స్టేషన్లలో ఎస్‌ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మిగిలిన ఎస్‌ఐల్లో కొందరు నాలుగేళ్లకు పైబడి ఐదేళ్ల సర్వీస్ ఒకే స్టేషన్‌లో పూర్తిచేసుకున్నా బదిలీ జరగకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కొందరు అదే పోస్టులో ఉండిపోయేందుకు పైరవీలు చేసుకుంటుండగా, మరికొందరు అక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయేందుకు తమ వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటున్నారు. భీమిలి, ఎంవీపీ, టూటౌన్, ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ ఎస్‌ఐలతోపాటు మరికొందరు నాలుగేళ్లకు పైబడి సర్వీస్ పూర్తిచేసుకున్నట్టు సిబ్బంది చెబుతున్నారు. ఏళ్ల తరబడి ఒకేచోట ఉండిపోవడంతో సిబ్బందిలో కొందరితో సత్సంబంధాలు, మరికొందరికి విభేదాలు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో తమకు అనుకూలంగా ఉండే సిబ్బంది పట్ల ఉదాసీనంగా ఉంటూ వారికి కోరినచోట డ్యూటీలు కేటాయిస్తూ, గిట్టని వారికి తరచూ కష్టమైనచోట డ్యూటీలు వేయడం, బందోబస్తులకు పంపించడం ద్వారా వేధింపులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఏళ్ల తరబడి ఒకేచోట పనిచేయడంతో కొందరు ఎస్‌ఐలు ఆ పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యాపారులు, ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకులు, భవన నిర్మాణ సామగ్రి రవాణా చేసే వారితో సత్సంబంధాలు ఏర్పరచుకుని నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను నగరంలోకి అనుమతించడం, రోడ్డుపైనే లోడింగ్, అన్‌లోడింగ్‌కు అవకాశం కల్పించడం చేస్తున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న వారిలో

... మిగతా 6వ పేజీలో

వెంకటాపురం గ్రామస్థులపై కేసులు ఉపసంహరణ

- ఎల్జీ పాలిమర్స్ ఘటన సమయంలో 32 మందిపై నాటి ప్రభుత్వం కేసులు
- వాటిని ఎత్తివేయాల్సిందిగా హోం శాఖకు ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాలు

గోపాలపట్నం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి):

ఎల్జీ పాలిమర్స్ ఘటనపై నిరసన గళం విప్పినందుకు నాటి ప్రభుత్వం 32 మంది గ్రామస్థులపై నమోదుచేసిన కేసులను ఉపసంహరించుకోవాలని ప్రస్తుత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం రాష్ట్ర హోం శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2020లో గోపాలపట్నం మండలం వెంకటాపురం గ్రామంలోని ఎల్జీ పాలిమర్స్ నుంచి విషవాయువులు లీకై 12 మంది మృతిచెందగా, వందలాది మంది అనారోగ్యంతో ఆస్పత్రి పాలయ్యారు. అప్పట్లో నెలకొన్న పరిణామాలు, వైసీపీ ప్రభుత్వం అనుసరించిన విధానాలపై పలువురు గ్రామస్థులు నిరసన తెలిపారు. దీంతో ఐపీసీ 147, 447, 353, 188, 271 సెక్షన్‌లు, విపత్తుల నిర్వహణ యాక్ట్ సెక్షన్ 51 (ఏ) అండ్ (బీ) సెక్షన్‌లతో పాటు అంటువ్యాధుల యాక్ట్ సెక్షన్ 3 కింద 32 మంది గ్రామస్థులపై గోపాలపట్నం పోలీసులు కేసులు నమోదు చేశారు. కేసు విచారణ నిమిత్తం ఆ 32 మంది కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. తమపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కూటమి ప్రభుత్వానికి బాధితులు విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో ఘటనపై పూర్తివిచారణ జరిపిన అనంతరం బాధితులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని హోం శాఖకు ప్రభుత్వం సూచించింది. భారతీయ నాగరిక సురక్ష సంహిత (బీఎన్‌ఎస్‌ఎస్, 2023) సెక్షన్ 360 కింద పిటిషన్ దాఖలు చేసి, కేసు ఉపసంహరణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హోం శాఖ డీజీపీకి లేఖ పంపింది. ప్రభుత్వ నిర్ణయంపై బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంటులో ప్రమాదం... కాంట్రాక్టు కార్మికుడి మృతి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):



సంఘటన స్థలంలో సురేష్‌సింగ్ మృతదేహం

స్టీల్‌ప్లాంటు ఎస్ఎంఎస్-1 విభాగంలో సోమవారం జరిగిన ప్రమాదంలో కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్ఎంఎస్ విభాగంలోని కేఆర్‌ఎల్ ఇంజనీరింగ్‌లో సురేష్‌సింగ్ (26) అన్‌స్కిల్డ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా స్లాగ్‌ను డంపర్‌లో లోడ్ చేస్తుండగా కిందనే ఉన్న సురేష్‌సింగ్‌పై పడింది. దీంతో అతను సంఘటనా స్థలంలోనే మృతిచెందాడు. కార్మికుడికి ఇన్స్యూరెన్స్ మొత్తంతో పాటు రూ.రెండు లక్షల పరిహారం, కుటుంబంలో ఒకరికి ఉపాధి, దహన ఖర్చులు చెల్లించడానికి సంబంధిత కాంట్రాక్టర్

... మిగతా 6వ పేజీలో

స్టీల్‌ప్లాంటు అధికారిపై పోక్సో కేసు

ఉక్కుటౌన్‌షిప్ , ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

స్టీల్‌ప్లాంటు అధికారిపై పోక్సో కేసు నమోదైంది. ఇందుకు సంబంధించి స్టీల్‌ప్లాంటు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సెక్టార్-1లో నివాసముంటున్న ఉక్కు ఉద్యోగి కుమార్తె నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతుంది. బాలిక ఆదివారం స్థానికంగా ఉన్న బ్యాడ్మింటన్ అకాడమీకి వెళ్లింది. అక్కడ నుంచి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ప్లాంటులో మేనేజర్‌గా పనిచేస్తున్న వై.కిరణ్ వెంటపడి లోదుస్తుల గురించి కామెండ్ చేయడంతో పాటు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో స్టీల్‌ప్లాంటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బియ్యానికి బదులు డబ్బులు!

ఇదీ నగరంలో పలువురు రేషన్ డీలర్ల తీరు

- ఐవీఆర్‌ఎస్ సర్వేలో వెల్లడి
- కార్డుదారులు ప్రశ్నిస్తే బెదిరింపు ధోరణిలో సమాధానం
- నోటీసులు ఇచ్చి వివరణ తీసుకున్న పౌర సరఫరాల శాఖ
- బియ్యం ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక



గాజువాక/మహారాణిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

నగరంలో కొంతమంది రేషన్ డీలర్లు కార్డుదారులకు బియ్యం ఇవ్వడం లేదు. అందుకు బదులు డబ్బులు (కిలోకు రూ.12 నుంచి రూ.14) ఇస్తున్నారు. దీనిపై ఎవరైనా ప్రశ్నిస్తే...'ఇది మీ డిపో కాదు, మీ కార్డుతో మ్యాపింగ్ అయిన డిపో ఫలానా వీధిలో ఉంది. అక్కడకు వెళ్లి తీసుకోండి' అంటూ బెదిరిస్తున్నారు. ఈ విషయం ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్‌ఎస్ సర్వేలో బట్టబయలు చేసింది.

రేషన్ డిపోల్లో సరకుల పంపిణీ ప్రారంభించి మూడు నెలలైంది. జూన్ నుంచి డిపోల వద్దే కార్డుదారులకు బియ్యం, పంచదార అందజేస్తున్నారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు (ఎండీయూ) రద్దు నేపథ్యంలో కార్డుదారుల పట్ల డీలర్లు ఏ విధంగా వ్యవహరిస్తున్నరో తెలుసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సరకుల పంపిణీ, తూకం వంటి అంశాలపై ఐవీఆర్‌ఎస్ (ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్) ద్వారా సర్వే చేసింది. కార్డుదారుల పట్ల డీలర్లు మర్యాదగా ఉంటున్నారా?, సరకులు సక్రమంగా పంపిణీ చేస్తున్నారా?, సరకులు నాణ్యంగా ఉంటున్నాయా?, ఏమైనా ప్రలోభాలకు గురిచేస్తున్నారా?...తదితర ప్రశ్నలు వేసి సమాధానం రాబడుతున్నారు. జూలై నెలకు సంబంధించి ఐవీఆర్‌ఎస్ సర్వే వివరాల ప్రకారం నగరంలో చాలా చోట్ల ముఖ్యంగా గాజువాక, కంచరపాలెం, ఎన్‌ఏడీ, గోపాలపట్నం, వన్‌టౌన్, ఆరిలోవ, తదితరచోట్ల వేలిముద్ర వేయించుకుంటున్నారు కానీ బియ్యం ఇవ్వడం లేదని, అందుకు బదులు కిలోకు రూ.12 నుంచి రూ.14 వరకూ ఇస్తున్నారని కార్డుదారులు వివరించారు. తమకు డబ్బులు వద్దు, బియ్యం కావాలని అడిగితే...ఇది మీ డిపో కాదని, ఫలానా వీధిలో మీ కార్డుతో మ్యాపింగ్ అయిన డిపో ఉందని చెబుతున్నారని పలువురు ఫిర్యాదు చేశారు.

విశాఖ జిల్లాలో 600కుపైగా డిపోల ద్వారా ఐదు లక్షల మంది కార్డుదారులకు ప్రతి నెలా ఎనిమిది వేల టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే ఎండీయూల హయాంలో మాదిరిగానే కొందరు రేషన్ డీలర్లు కూడా బియ్యం పక్కదారి పట్టిస్తున్నారని ఈ సర్వేలో వెల్లడైంది. దీనికి సంబంధించి పౌర సరఫరాల శాఖ కమిషనరేట్ నుంచి జిల్లాకు సమాచారం వచ్చింది. ఆయా డీలర్లకు జిల్లా పౌర సరఫరాల శాఖ గత నెలాఖరున నోటీసులు జారీచేసి వివరణ ఇవ్వాలని ఆదేశించింది. నోటీసుల మేరకు డీలర్లు వివరణ ఇచ్చారని తెలిసింది. ఈ క్రమంలో ఆగస్టు నెల ఒకటో తేదీ నుంచి సరకుల పంపిణీ ప్రారంభం కావడంతో పౌర సరఫరాల శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి డిపోలను తనిఖీ చేస్తున్నారు. అక్కడకు వచ్చిన కార్డుదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. కార్డుదారుల పట్ల మర్యాదగా ఉండాలని, వేలిముద్ర వేసిన తరువాత బియ్యం మాత్రమే ఇవ్వాలని...సొమ్ములు అందజేసే ప్రక్రియ చేపడితే చర్యలు తీసుకుంటామని డీలర్లకు హెచ్చరిస్తున్నారు. ఈ నెలలో పంపిణీ పూర్తయిన తరువాత ప్రభుత్వం చేపట్టే ఐవీఆర్‌ఎస్ సర్వేలో కార్డుదారులు ఎలా స్పందిస్తారో చూడాలి.

చురుగ్గా 'సృష్టి' కేసు దర్యాప్తు

- నగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీలు
- ఇద్దరు వైద్యులను ప్రశ్నించడంతోపాటు రికార్డులు స్వాధీనం?


విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

'సృష్టి' ఫెర్టిలిటీ సెంటర్ కేసు దర్యాప్తులో పోలీసులు జోరు పెంచారు. తాజాగా నగరంలో గవర్నర్ బంగ్లాకు సమీపాన గల ఒక ప్రైవేటు ఆస్పత్రిలో తనిఖీలు నిర్వహించిన పోలీసులు అక్కడ పనిచేస్తున్న ఇద్దరు వైద్యులను ప్రశ్నించి, కీలకమైన డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. 'సృష్టి' కేసులో ఆస్పత్రికి చెందిన వైద్యుల ప్రమేయాన్ని నిర్ధారించేందుకు అనుగుణమైన ఆధారాలను సేకరించినట్టు సమాచారం. విచారణలో భాగంగా పోలీసులు కేజీహెచ్‌కు కూడా వెళ్లినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఆస్పత్రి అధికారులు మాత్రం నిర్ధారించడం లేదు. సృష్టి వ్యవహారంలో కేజీహెచ్‌కు చెందిన మరో ఇద్దరు వైద్యుల ప్రమేయం ఉందన్న వార్తలతో ఆస్పత్రి వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే, నవజాత శిశువుల విక్రయంలో మరో నలుగురు దళారులు ఉన్నట్టు గుర్తించిన పోలీసులు...వారిని మంగళవారం అదుపులోకి తీసుకునే అవకాశం ఉందంటున్నారు.

చెరువులకు పునరుజ్జీవం

ఏడాది క్రితం వీఎంఆర్‌డీఏ శ్రీకారం

- జీవీఎంసీతో కలిసి ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనులు
- తొలి విడత కాపులుప్పాడ ప్రాంతంలో చెరువులపై దృష్టి
- ప్రస్తుతం నీటితో కళకళ



నీటితో కళకళలాడుతున్న చెరువు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నగరంలో చెరువులన్నీ కనుమరుగైపోయాయి. మురుగునీటి గెడ్డలు సైతం ఆక్రమణకు గురైపోయాయి. వర్షం కురిస్తే వరద ముంచెత్తుతోంది. నీటి పారుదలకు అవకాశం లేకుండాపోయింది. అయితే శివార్లలో ఇంత దారుణ పరిస్థితులు లేవు. ఆక్రమణదారుల కన్ను పడని చెరువులు కొన్ని ఉన్నాయి. వాటిని పునరుద్ధరించాలని జిల్లా అధికారులు చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ముప్ఫై ఏళ్ల క్రితం పూడుకుపోయిన చెరువులు ఇపుడు నీటితో కళకళలాడుతున్నాయి.

విశాఖ నగరం విస్తరించిన తరువాత శివార్లలో చెరువులన్నీ రికార్డుల్లో మాత్రమే ఉన్నాయి. స్థానిక రైతుల నీటి అవసరాలు తీర్చడానికి, పర్యావరణ సమతుల్యత పెంచి పక్షుల సంఖ్య పెంచడానికి, వలస పక్షులను పూర్వంలా రప్పించడానికి వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఏడాది క్రితం 'చెరువుల పునరుద్ధరణ' పథకానికి శ్రీకారం చుట్టారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ కలసి ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పనులు చేపడతామని చెప్పగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆమోదించారు. వీఎంఆర్‌డీఏ, జీవీఎంసీ రికార్డులన్నీ సమగ్రంగా పరిశీలించి, ఆక్రమణలకు గురైన చెరువులను వదిలేయగా, ఎటువంటి పనులు చేపట్టకపోవడం వల్ల పూడుకుపోయిన 24 చెరువులు, 17 నీటి కాలువలను గుర్తించారు. సర్వే నంబర్లు, రిమోట్ సెన్సింగ్, జియో ఇన్‌ఫర్మేషన్‌తో వాటిని గుర్తించారు. గొలుసుకట్టుగా వాటిని అభివృద్ధి చేయాలని నిర్ణయించి, వాటిని మూడు కాస్కేడ్ (జలపాతాలు)లుగా చేశారు. కాపులుప్పాడ కాస్కేడ్‌లో నాలుగు చెరువులు, రాంపురం కాస్కేడ్‌లో ఏడు చెరువులు, నరవ కాస్కేడ్‌లో ఎనిమిది చెరువులు అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

తొలి విడతగా కాపులుప్పాడ కాస్కేడ్‌లో 15 ఎకరాల పోతివాని చెరువును అభివృద్ధి చేశారు. ఆ తరువాత 12 ఎకరాల్లో బాడవ చెరువు, ఆపై కాపులుప్పాడ సమీపాన 5.5 ఎకరాల్లో దేవరవాణి చెరువు పనులు

... మిగతా 6వ పేజీలో



స్వామివారికి గరుడసేవ చేస్తున్న అర్చకులు

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులకు శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్ర పుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు పంపిణీ చేశారు. తొలుత అదే వేదికపై సహస్రనామ తులసీ దళార్చన నిర్వహించారు. స్వామిని గరుడ వాహనంపై ఉంచి గరుడ సేవ జరిపారు.

మండపాలకు అనుమతి తప్పనిసరి

పద్మనాభం రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని సీఐ శ్రీధర్ చెప్పారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండపాలు ఏర్పాటు చేసేవారు ముందుగా పోలీసుల అనుమతి కోరుతూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్మిక నేత ధర్మారెడ్డికి నివాళి



ధర్మారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మికులు

తగరపువలస, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం మాజీ అధ్యక్షుడు చిల్లా ధర్మారెడ్డి 7వ వర్ధంతి సోమవారం చిట్టివలసలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు, కార్మికులు ధర్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్మికుల సంక్షేమానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ కార్మిక సంఘం ప్రస్తుత అధ్యక్షుడు జేవీ కైలాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు దల్లి అప్పలరెడ్డి, గొండేల అప్పారావు, ఎం. ఆదినారాయణ, జనసేన నాయకుడు నీలాపు శంకరరెడ్డి, గిడిజాల రమణ, బోర రామారావు, తదితరులు పాల్గొన్నారు.

టెంటు, సైడ్‌వాల్స్ వితరణ



పాఠశాలకు టెంటు, ఇతర సామగ్రి అందించిన దాతలు

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాటితూరు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి మజ్జి సూర్య, అన్నపూర్ణ దంపతులు టెంటు, సైడ్‌వాల్స్ వితరణగా అందించారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో వీటిని ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బి. సోమేశ్వరరావు,,సభ్యులు అప్పలరాజు, రాజా, రమేశ్, ఉపాధ్యాయులు ప్రసాదరావు, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులకు నిధుల లేమి



పథకంలో భాగంగా నిర్మించిన ట్యాంక్

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మజ్జివలస గ్రామంలో జల జీవన్ మిషన్ పథకం పనులు నిధుల లేమి వల్ల నిలిచిపోయాయి. ఈ పథకం కోసం ప్రభుత్వం రూ.58 లక్షలు మంజూరు చేసింది. వీటిలో రక్షిత మంచినీటి ట్యాంక్ నిర్మించారు. ఇంటింటికి కొళాయి కనెక్షన్లు ఇవ్వడానికి కొంతమేర ప్రయత్నాలు జరిగాయి. నిధుల లేమి వల్ల ఆ పనులు సగంలో ఆగిపోయాయి. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామస్థులు ఈ సమస్యను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లడంతో పంచాయతీ నుంచి రూ. 5 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ. 6 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులు కూడా చాలకపోవడంతో పనులు పూర్తికాలేదు. దీంతో గ్రామస్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. మరో రూ. 6 లక్షలు విడుదల చేస్తే గాని పనులు పూర్తయ్యే అవకాశం లేదని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

- వారం రోజుల్లో పరిస్థితి మెరుగుపడాలి
- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, మధురవాడ జోన్‌లలో నెలకొన్న తాగునీటి సమస్యను వారం రోజుల్లో పరిష్కరించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన ఎంవీపీ కాలనీలో వున్న తన క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు జోన్లలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని తన దృష్టికి వచ్చిందని, ఆలస్యం చేయకుండా సమస్యను పరిష్కరించాలని చెప్పారు. వేసవిలో లేని నీటి కొరత ఇపుడు ఉత్పన్నం కావడానికి గల కారణాలను అన్వేషించాలన్నారు.భవిష్యత్‌లో మళ్లీ సమస్య పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.అపార్టుమెంట్ల నిర్మాణం ఎక్కువ కావడంతో 150 అడుగుల లోతున బోర్లు తవ్వినా ప్రయోజనం ఉండడం లేదని కార్పొరేటర్లు ఆయన దృష్టికి తీసుకురాగా జోన్ వన్, జోన్ టుకు ఎనిమిది చొప్పున బోర్లు మంజూరు చేస్తున్నామని, వాటిని 6.5 ఇంచ్ వెడల్పుతో 300 అడుగుల లోతున తవ్వే అవకాశాలను పరిశీలించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. రెండు జోన్లలో అసిస్టెంట్ ఇంజనీర్ల కొరత ఉండడంతో వాటర్ వర్క్స్ విభాగంలో సమర్థవంతంగా సేవలు అందించలేకపోతున్నారని తెలుపగా, సిబ్బంది సంఖ్య పెంచాలని చీఫ్ ఇంజనీరు పల్లంరాజును ఆదేశించారు. కాగా మధురవాడ, భీమిలి జోన్‌లో 35 మిలియన్ లీటర్ల మంచినీరు అవసరం ఉందని, 2040 నాటికి 50 ఎంఎల్‌డీ డిమాండ్ ఉంటుందని అంచనా వేశామని జీవీఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీరు రవి తెలిపారు. సమస్య పరిష్కారానికి కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి నరవ, ముడసర్లోవ మీదుగా మధురవాడకు రూ. 500 కోట్లతో ప్రతిపాదించిన పైప్‌లైన్ నిర్మాణం పూర్తయితే తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అలాగే, అపార్ట్‌మెంట్ల నిర్మాణానికి బల్క్ వాటర్‌కు విపరీతమైన డిమాండ్ ఉందని, మరో రెండేళ్లలో పూర్తి స్థాయిలో బల్క్ వాటర్ అందిస్తామన్నారు. ప్రస్తుతం బల్క్ వాటర్ ద్వారా జీవీఎంసీకి రూ. 18 కోట్లు ఆదాయం వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో చీఫ్ ఇంజనీరు పల్లంరాజు, వాటర్ వర్క్స్ సూపరింటెండెంట్ ఇంజనీరు రవి, జోనల్ కమిషనర్లు కనకమహాలక్ష్మి, అయ్యప్పనాయుడు, హేమావతి, కార్పొరేటర్లు పీవీ నరసింహం, అప్పారావు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సామాజిక భవనం

ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



రాట్నం తిప్పుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

తగరపువలస, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : భీమిలి, తగరపువలస ప్రాంతాల్లోని చేనేత కార్మికుల కోసం సామాజిక భవనం నిర్మిస్తామని, అందుకు భీమిలిలో స్థలం మంజూరు చేస్తామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. సోమవారం తగరపువలస కన్వెన్షన్ హాలులో జరిగిన చేనేత కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయం తరువాత పెద్ద రంగంగా ఉన్న చేనేతకు చేయూతనివ్వడానికి కూటమి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పారు. పాఠశాలల విద్యార్థుల యూనిఫారాలు తయారు చేసే బాధ్యతను ప్రభుత్వం చేనేత కార్మికులకు అప్పగించిందన్నారు. చేనేత కార్మికులు అని కాకుండా చేనేత కళాకారులుగా వారిని సంబోధించాలని కోరారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 300 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇవ్వనున్నట్టు తెలిపారు. వృత్తిపై ఆధారపడిన 17 ఉప కులాలను ఆదుకోవడానికి ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు గాడు చిన్నికుమారి లక్ష్మి, ఎల్.అప్పారావు, నరసింహం, కొప్పల ప్రభావతి, జడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, రమేశ్, నూరిబాబు, వానపల్లి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస పక్కన చిట్టివలస పేరు చేర్చాలి

జంట గ్రామాలైన తగరపువలస, చిట్టివలస పేర్లు ఒకే బోర్డులో ఉండేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని చిట్టివలస పరిరక్షణ సమితి తరపున బళ్ల వెంకట్రావు ఎమ్మెల్యే గంటాను కోరారు. ఈమేరకు ఆయన వినతిపత్రం అందించారు. ప్రభుత్వ రికార్డుల్లో చిట్టివలస అని ఉన్నప్పటికీ బస్సులపై, కార్యాలయాలపై తగరపువలస పేరు మాత్రమే అని రాస్తున్నారని చెప్పారు. చిట్టివలస పరిధిలో ఉన్న కార్యాలయాలపై కూడా తగరపువలస అని రాయడం వల్ల గందరగోళం ఉందన్నారు. ఎంతో ప్రాధాన్యత కలిగిన పురాతన పట్టణంగా ఉన్న చిట్టివలసకు గుర్తింపు తీసుకురావాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పేరు మార్పు గురించి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు.

ఉధృతంగా కెరటాలు



రుషికొండ బీచ్‌లో ఉప్పొంగిన సముద్రం

సాగర్‌నగర్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో రుషికొండ, సాగర్‌నగర్ తీరంలో సముద్రం సోమవారం కొన్నిమీటర్ల ముందుకు వచ్చింది. అలలు ఇసుక తెన్నులు దాటి ముందుకు రావడంతో సందర్శకులు ఆందోళన చెందారు. సముద్రం బాగా ముందుకు వచ్చి అలలు విరుచుకుపడుతుండడంతో తీరం కోతకు గురవుతోంది. రుషికొండ బీచ్‌లో బోటు షికార్ నిర్వహించే ప్రాంతానికి సమీపంలో అలలును నిలువరించేందుకు గతంలో వేసిన రాళ్ల మొత్తం నీట మునిగాయి. బీచ్‌లో పదేళ్ల క్రితం ఈ తరహాలో సముద్రం ఉప్పొంగడం చూశామని, మళ్లీ ఇప్పుడు చూస్తున్నామని మత్స్యకారులు చెబుతున్నారు.

పీజీఆర్‌ఎస్‌కు ఏడు వినతులు



జడ్సీ అయ్యప్పనాయుడుకి వినతిపత్రం ఇస్తున్న నూకరాజు, తదితరులు

భీమునిపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఏడు వినతులు అందాయి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జడ్సీ అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. రెవెన్యూ విభాగానికి, పట్టణ ప్రణాళికా విభాగానికి ఒక్కొక్కటి చొప్పున, ఇంజనీరింగ్ విభాగానికి ఐదు అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. కాగా 3, 4 వార్డుల సరిహద్దు సమస్యను తక్షణమే పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు కోరారు. ఈమేరకు ఆయన జడ్సీకి వినతిపత్రం అందించారు. సరిహద్దు సమస్య వల్ల రెండు వార్డుల ప్రజలు సంక్షేమ పథకాల అమలులో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అలాగే, తోటవీధి, కృష్ణాకాలనీలో ఓపెన్ జిమ్, ఎగువపేటలో ఇండోర్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు.

కుండలపై పెయింటింగ్ పోటీలు



కుండలపై పెయింటింగ్ వేస్తున్న చిన్నారులు

ఆనందపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీ ఐఐఎం రోడ్డులో ఉన్న హరేకృష్ణ మూవ్మెంట్ ఆధ్వర్యంలో హెరిటేజ్ ఫెస్ట్-2025 వేడుకలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు సోమవారం కుండలపై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 300 మంది పోటీలకు హాజరయ్యారు. అలాగే పేపర్ క్రాఫ్ట్ వర్క్ (కాగితంతో చేసే కళ) పోటీలు కూడా నిర్వహించారు.

ఫుట్‌బాల్ టోర్నీ పోస్టర్ ఆవిష్కరణ

భీమునిపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కలిగొట్ల స్నిగ్ధశ్రీ జయంతి పురస్కరించుకుని మంగళవారం నుంచి జరిగే ఉత్తరాంధ్ర ఫుట్‌బాల్ ఆహ్వాన టోర్నమెంట్ పోటీల పోస్టర్‌ను, ట్రోఫీని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఫుట్‌బాల్ క్రీడాకారుడు చినబాబు, నాయకులు గంటా నూకరాజు, నరేంద్ర కుమార్, కార్పొరేటర్ చిన్నికుమారి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల బాలికలు

భీమునిపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యారు. విశాఖ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అచ్యుతాపురం మండలం నునపర్తి గ్రామంలో అండర్ 16 సబ్ జూనియర్స్ విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఆర్.లాస్య, ఎ.భువన, బి.సిరి ప్రసన్న ప్రతిభ చూపడంతో ఈనెల 29, 30, 31 తేదీల్లో ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్టు తరఫున ఎంపిక చేశారు. ఈమేరకు విద్యాలయం ప్రిన్సిపాల్ కె. రామలక్ష్మి విద్యార్థినులను, పీఈటీ మహాలక్ష్మిని అభినందించారు.

కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా!

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):
జిల్లా కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా ఉన్న విషయం తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ కార్యాలయం తెలిపింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నకిలీ ప్రొఫైల్‌ను అనుసరించవద్దని, వాటిపై స్పందించవద్దని కోరింది. ఈ ఖాతాను అధికారికంగా గుర్తించలేదని పేర్కొంది. collectorpeshi@gmail.comతో లింక్ అయినా ఖాతా మాత్రమే అధికారికమైనదని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కార్యాలయం సూచించింది.

రేషన్ డిపో తనిఖీ

ఆనందపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బిపి కళ్లాలు పంచాయతీలో ఉన్న రేషన్ డిపోను సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ కె. శ్రీనివాసరావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపో నెంబరు 38పై కార్డుదారుల నుంచి తరచూ ఫిర్యాదులు రావడంతో ఈ తనిఖీలు జరిపారు. సరకుల నిల్వలో తేడా ఉండడంతో డీలర్ బంటుపల్లి సుమంగిపై 6-ఏ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీటీ మాట్లాడుతూ డీలర్లు కార్డుదారులకు జవాబుదారీగా ఉండాలన్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ హిస్టరీ, బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం జనరల్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ ఫిజిక్స్, బీఎస్సీ కెమిస్ట్రీ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ మ్యాథమెటిక్స్, బీఎస్సీ జువాలజీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ తెలిపారు. సోమవారం ఆమె ప్రకటన విడుదల చేశారు.



చంద్రబాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కల్లుగీత కార్మికులు

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ఆనందపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : బార్ పాలసీలో కల్లుగీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడంపై టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంగటి రాము హర్షం వ్యక్తం చేశారు. సోమవారం కల్లివానిపాలెంలోని యాతపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో పది శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. బార్ పాలసీలో కూడా పది శాతం రిజర్వేషన్ కల్పించి ప్రభుత్వం గీత కార్మికులకు అండగా నిలిచిందని చెప్పారు.

ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు

ఎండాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :ఎండాడలోని హయగ్రీవ ప్రాజెక్ట్ సమీపంలోని కొండపై ఆక్రమణల తొలగింపునకు వెళ్లిన రెవెన్యూ సిబ్బందిపై స్థానికులు దౌర్జన్యానికి పాల్పడిన సంగతి విదితమే. అదే స్థలంలో ఆక్రమణదారులు బోరు వేయడంతో వీఆర్‌వోలు సోమవారం అక్కడికి వెళ్లి బోరును తొలగించడంతో పాటు ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



పనులను అడ్డుకుంటున్న రైతులు

ఎంఎస్ఎంఈ పార్కు పనులు అడ్డగింపు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను గ్రామానికి చెందిన కొందరు రైతులు సోమవారం అడ్డుకున్నారు. పార్కు కోసం తీసుకున్న భూమిలో కొంతమేర తాము చెట్లు పెంచుకుని జీవిస్తున్నామని, పరిహారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ఆందోళన చేశారు. ఏపీఐఐసీ అధికారులు వారికి నచ్చచెప్పారు. రెవెన్యూ అధికారులు తమకు భూమి అప్పగించారని తెలిపారు. చివరకు పద్మనాభం తహసీల్దార్ సూచన మేరకు పనులను ఏపీఐఐసీ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. కృష్ణాపురంలో 63 ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. తొలి దశలో 23 ఎకరాల్లో రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కోసం రూ.12.4 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టరుకు పనులు అప్పగించారు. ఈమేరకు కాంట్రాక్టరు పనులు చేస్తున్నారు. రెండో విడతలో మిగిలిన 40 ఎకరాలను అభివృద్ధి చేశారు. కాగా రెండు నెలలు క్రితం పార్కుకు శంకుస్థాపన చేసినపుడు రైతులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు. వారిని వైసీపీ నేతలు రెచ్చగొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆహార కల్తీ నియంత్రణకు 'షీ' టీమ్స్

... 5వ పేజీ తరువాయి

ప్రతీరోజూ 16 బృందాలు కనీసం 50 చోట్ల తనిఖీలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆయాచోట్ల వినియోగించే ముడిపదార్థాలు, విక్రయించే ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతను పరిశీలిస్తాయన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించకుండా బయో డీగ్రేడబుల్ ప్లాస్టిక్ లేదా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించేలా చర్యలు తీసుకుంటారన్నారు. కొన్నాళ్ల పరిశీలించిన తర్వాత ఇంకా తనిఖీలను పెంచాల్సిన అవసరం ఉందని గుర్తిస్తే ప్రతీజోన్‌కు అదనంగా రెండు చొప్పున బృందాలను నియమిస్తామన్నారు. ప్రతిరోజూ తనిఖీలు జరుగుతాయనే విషయం తెలిసినట్టయితే వ్యాపారులు ఆహార నాణ్యత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్‌లో పాతుకుపోయిన ఎస్ఐలు

... 5వ పేజీ తరువాయి

ఒకరిద్దరు తమను వేరొకచోటకు బదిలీ చేయాలని తమ పైఅధికారులకు విజ్ఞప్తి చేసినా ఉన్నతాధికారుల జోక్యం లేకుండా బదిలీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారని ఎస్ఐలు వాపోతున్నారు. ఎస్ఐలు లాంగ్ స్టాండింగ్ వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఈ వ్యవహారంపై ఇప్పటికైనా పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి దృష్టిసారించాలనే డిమాండ్ డిపార్టుమెంట్ నుంచే వినిపిస్తోంది.

చెరువులకు పునరుజ్జీవం

... 5వ పేజీ తరువాయి

చేపట్టారు. మొదటి రెండు చెరువులకు పక్కనున్న గెడ్డల ద్వారా నీరు వచ్చే అవకాశం ఉండగా, దేవరవాణికి ఆ సౌకర్యం లేదు. దాంతో బాడవ చెరువు నుంచి పైపుల ద్వారా దేవరవాణికి నీరు వచ్చేలా చేశారు. ఇప్పుడు ఆ చెరువు నీటితో కళకళలాడుతోంది. ఈ కాస్కేడ్‌లో నాలుగోది కంబాల చెరువు. దానిని కూడా పూర్తిచేసేందుకు పనులు చేపడుతున్నారు. అది కూడా పూర్తయితే చెరువుల పునరుద్ధరణ పథకంలో తొలి దశ 'కాపులుప్పాడ కాస్కేడ్' రైతులకు అందుబాటులోకి వస్తుంది. ఆ తరువాత దశలో రాంపురం, నరవ కాస్కేడ్ పనులు చేపడతారు.

ఇవన్నీ గొలుసుకట్టు చెరువులు

ఎన్.విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

పూడుకుపోయి, ఆక్రమణలకు గురికాకుండా ఉన్న చెరువులను పునరుద్ధరించడానికే ఈ పథకం చేపట్టాం. ఇవన్నీ గొలుసుకట్టు చెరువులు. ఒక చెరువు నిండిన తరువాత దాని నుంచి మరో చెరువుకు నీరు వెళుతుంది. దాంతో అన్ని నీటితో కళకళలాడతాయి. వీటిని పునరుద్ధరించడం వల్ల స్థానిక రైతులకు పంటలు పండించుకునే వెసులుబాటు కలుగుతుంది. జీవావరణం ఇంతకు ముందులా పునరుద్ధరణ జరుగుతుంది. ఏడాది కాలంలోనే మొదటి దశ పూర్తిచేయడం సంతోషంగా ఉంది.

స్టీల్‌ప్లాంటులో ప్రమాదం...

... 5వ పేజీ తరువాయి

అంగీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. స్టీల్‌ప్లాంటు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీపీ విభాగంలో...

ఇదిలావుండగా సీవో సీసీపీ విభాగంలో అగనంపూడి ప్రాంతానికి చెందిన టి.అప్పారావు (56) క్లీనింగ్ పనులు చేసేవారు. ఆదివారం మధ్యాహ్నం విభాగంలో విధులు నిర్వర్తిస్తుండగా ఒక్కసారిగా పడిపోయారు. దీంతో అప్పారావును హుటాహుటిన ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. అయితే దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు.

ఆందోళనలో అన్నదాతలు

- పద్మనాభంలో సగం కూడా పూర్తికాని వరి నాట్లు

పద్మనాభం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులను వర్షాభావం వెంటాడుతోంది. మూడు నెలలుగా సాధారణ వర్షపాతమే నమోదు కావడంతో ఖరీఫ్ సాగుపై ఆందోళన చెందుతున్నారు.అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వరి సాగుపై నీలి నీడలు కమ్ముకున్నాయి. ఇదే పరిస్థితి ఈనెలాఖరు వరకు కొనసాగితే మండలంలో కరువు ఛాయలు కమ్ముకొనే ప్రమాదం ఉందన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో వరిసాధారణ విస్తీర్ణం 6800 ఎకరాలు కాగా ఇప్పటివరకు 4500 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేశారు. వ్యవసాయ బోర్లు, నీటి సదుపాయం ఉన్న చెరువు ఆయకట్టు ప్రాంతాల్లో, గోస్తనీ నదిపై ఉన్న ఆనకట్టలకు అనుబంధంగా ఉన్న కాలువల కింద సుమారు 1500 ఎకరాల వరకు నాట్లు వేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల కొత్త కొవ్వాడ, పాత కొవ్వాడ తదితర గ్రామాల్లోని రైతులు నారు వేసే అవకాశం లేక నేరుగా వరి విత్తనాలను ఎద పద్ధతిలో చల్లారు. పూర్తిగా వర్షాధార గ్రామాలైన గంధవరం, పెంట, కొవ్వాడ, అయినాడ, బీఆర్ తాళ్లవలస, చిన్నాపురం, కోరాడ, రెడ్డిపల్లి, రేవిడి, వెంకటాపురం తునివలస, నేరేళ్లవలస తదితర గ్రామాల్లోని పంట భూములపై వర్షాభావ పరిస్థితులు తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. మే నెలలో సాధారణ వర్షపాతం 117.5 మి.మీ కాగా, 104.2 మి.మీ కురిసింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 156.4 మి.మీ కాగా, కేవలం 88.7 మి.మీ మాత్రమే పడింది. జూలైలో సాధారణ వర్షపాతం 171.7 మి.మీ కాగా 117.6 మి.మీ కురిసింది. జూన్, జూలై నెలల్లో విస్తారంగా వర్షాలు కురిస్తే పూర్తిస్థాయిలో నారు మడులు తయారు కావడంతో పాటు నాట్లు కూడా సాధారణ విస్తీర్ణంలో 50 శాతానికి పైగా పూర్తయ్యేవి. చెరువులు కూడా నీటితో నిండి పంట చేతికి అందే వరకు నీటి సదుపాయం ఉంటుందన్న భరోసా ఉండేది. ఆగస్టులో కూడా ఇప్పటివరకు వర్షాలు లేవు. దీంతో రైతులు ఖరీఫ్ సాగుపై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు ఖర్చు చేశామని, పంటలు పండకపోతే నష్టాలు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శరవేగంగా రెయిలింగ్ పనులు

పద్మనాభం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో అనంత పద్మనాభుని ఘాట్ రోడ్డుకు రక్షణ కవచకంగా ఏర్పాటు చేస్తున్న రెయిలింగ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇనుప బారియర్స్‌ను భూమిలోకి పాతి, కాంక్రీటుతో పటిష్ఠంగా వేస్తున్నారు. వీటికి గేజు ఎక్కువగా ఉన్న ఇనుప ఫ్రేమ్‌లు ఏర్పాటు చేస్తారు. ఘాట్ రోడ్డులో ప్రయాణాలు సాగించేవారు ఎటువంటి ప్రమాదాలకు గురికాకుండా వీటిని ఏర్పాటు చేస్తున్నారు.


ప్రార్థనకు అవార్డు అందిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

నీట్ టాపర్‌కు కలెక్టర్ అభినందన

ఆరిలోవ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నీట్‌లో టాపర్‌గా నిలిచిన విశాఖ వ్యాలీ విద్యార్థిని ప్రార్థనను జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ సోమవారం అభినందించారు. పాఠశాలలో నిర్వహించిన వేడుకలో ఆయన పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ విద్యార్థుల విజయాలను కలెక్టర్‌కు వివరించారు. నీట్, జేఈఈ టాపర్‌గా నిలిచిన ప్రార్థనకు కలెక్టర్ అవార్డు అందించారు. ఎస్‌వోఎఫ్, ఐఏఎంలో ప్రతిభ కనబరచిన సరయు, ఆసియా రోలర్ స్కేటింగ్‌లో బంగారు పతకం సాధించిన గ్రీష్మా దొంతరలకు కలెక్టర్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ అడ్మిన్ వర్మ కౌన్సిల్ బ్యాడ్జిలను ప్రదానం చేసి, విద్యార్థులతో ప్రమాణం చేయించారు.

మురుగు కూపానికి మోక్షం


మురుగును తొలగిస్తున్న కార్మికుడు

మద్దిలపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంకాలనీ చాకలిపేటలో మురుగు కూపానికి మోక్షం లభించింది. రెండు నెలలుగా మురుగు నిల్వతో పురుగులు పట్టిన కాలువలను సోమవారం పరిశుభ్రం చేశారు. కాలువల నిర్మాణం పేరుతో రెండు నెలలుగా డ్రైనేజీల్లో పూడికలు తొలిగించకపోవడంతో మురుగు నిల్వఉండి పిఠాపురంకాలనీ దుర్గంధంతో నిండిపోయింది. కంపు భరించలేక ఈ రహదారిలో ప్రయాణాలు మానుకున్నారు. దీంతో కమిషనర్ సారూ ఇదేనా స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర శీర్షికన ఈనెల ఒకటో తేదీన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన శానిటేషన్ సిబ్బంది మురుగును శుభ్రం చేశారు.

తర్లువాడలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఆనందపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తర్లువాడ గ్రామంలో ఐటీబీపీ 56వ బెటాలియన్ ఆధ్వర్యంలో సోమవారం హర్ గర్ మే తిరంగ కార్యక్రమం నిర్వహించారు. బెటాలియన్ జవాన్లు ఇంటింటికి వెళ్లి జాతీయ జెండాను అందించి, ఇంటిపై ఎగరవేయాలని ప్రచారం చేస్తూ స్వాతంత్ర దినోత్సవం ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి మజ్జి వెంకటరావు, బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ వైవీ రెడ్డి, స్థానిక నాయకులు, జవాన్లు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడీ, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 30, పచ్చిమిర్చి 70, కాకరకాయలు 28, బీరకాయలు 24, ఆనపకాయ 22,కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46,దొండకాయలు 28, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 70, బరబాటి 22, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 60,బద్దచిక్కుడు 50, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 36, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 34, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్ర పెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామ కాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	93
లైవ్ ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

టీటీడీ కూడలికి ఆధ్యాత్మిక శోభ

రూ. 1.44 కోట్లతో సుందరీకరణ పనులు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో ఉన్న టీటీడీ కూడలి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఇక్కడ ఏర్పాటు చేసిన శంఖు చక్ర నామాలను శనివారం రాత్రి ప్రారంభించారు. నగరంలోని పలు కూడళ్లను స్మార్ట్ సిటీ నిధులతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.అందమైన విద్యుత్ దీపాలు, వాటర్ ఫౌంటెన్లతో కొత్త సొబగులు అద్దుతున్నారు. తాజాగా ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపం వద్ద ఉన్న సర్కిల్ కూడా సుందరంగా తీర్చిదిద్దారు. టీటీడీ కూడలిగా.. ఆ పేరుకు తగినట్టే ఈ సర్కిల్ ఆధ్యాత్మిక కూడలిగా రూపొందింది. సర్కిల్ వద్ద నాలుగు రోడ్ల కూడలి మధ్యలో గోవింద నామాలు ఏర్పాటు చేశారు. రోడ్డుకు రెండువైపులా కనిపించేలా వీటిని అమర్చారు. వాటర్ ఫౌంటెన్‌లు, విద్యుత్ దీపాలు, పచ్చదనం వంటివి ఏర్పాటు చేశారు. ఈ కూడలి నిర్మాణానికి స్మార్ట్ సిటీ నిధులు రూ. 1. 44 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటివరకు టీటీడీ కూడలిలో సాధారణ సర్కిల్ ఉండేది. తాజాగా చేపట్టిన పనుల్లో సర్కిల్ చుట్టూ స్టోన్ రోడ్డు నిర్మించారు. ఇటు ఇసుకతోట నుంచి వచ్చేటప్పుడు, అటు బీచ్ రోడ్డు నుంచి వచ్చేటప్పుడు రెండు వైపులా కనిపించేలా శంఖు చక్ర నామాలను ఏర్పాటు చేశారు. ఫౌంటెన్‌లు, విద్యుత్ దీపాలతో సాయంత్రం అయ్యేసరికి వెలుగులీనుతూ మనస్సుకు ఆధ్యాత్మిక ఆహ్లాదాన్ని పంచుతోంది. ఇక్కడే రైతు బజార్, కళాశాలలు, వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఉండడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. ముఖ్యంగా టీటీడీ కల్యాణ మండపంలో నిత్యం ఏదో ఒక కార్యక్రమం జరుగుతూ ఉంటుంది. వివాహ వేడుకలు సాధారణం కాగా, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతుంటాయి. ఈమేరకు కూడలిని శంఖు చక్ర నామాలతో తీర్చిదిద్దడం పట్ల స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.


టీటీడీ కూడలి వద్ద వెలుగులీనుతున్న గోవింద నమాలు

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు కార్యాచరణ

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పరిధిలోని ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, పార్కులు, రిజర్వ్ ప్రదేశాలు, ఇతర ఆస్తులు, ప్రజా ప్రాజెక్టు, పట్టణ ప్రణాళిక, ప్రజా సౌకర్యాలను పరిరక్షించే ఆస్తులపై హక్కులు ప్రభుత్వం, జీవీఎంసీకి ఉంటాయని కమిషనర్ కేతన్‌గార్గ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాటిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. నగరంలో ప్రభుత్వ స్థలాల పరిరక్షణ దిశగా జీవీఎంసీ ఆపరేషన్ లంగ్స్ కార్యక్రమాన్ని విస్తృత పరుస్తూ కార్యాచరణ చేపట్టిందని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. నగరంలో ప్రభుత్వ ఆస్తులు, ఖాళీ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా 'ఆపరేషన్ లంగ్స్' (లంగ్స్- లైఫ్ టు అర్బన్ గ్రీన్ స్పేసేస్) కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. జేసీబీలు, ట్రక్కులు, ఇతర భారీ యంత్రాలను కలిగిన యజమానులు, ఆపరేటర్లు, డ్రైవర్లందరికీ ప్రభుత్వ/జీవీఎంసీ భూముల్లో అనధికార ప్రవేశం, ఆక్రమణ నిషేధమని, ఉల్లంఘించిన వారి వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ వ్యవహారంలో కొన్ని ప్రత్యేక విధులను పట్టణ ప్రణాళిక విభాగం ఎస్టేట్ అధికారికి అప్పగించామన్నారు. జీవీఎంసీ ఎస్టేట్ అధికారి నుంచి లిఖితపూర్వక అనుమతి లేకుండా ప్రభుత్వ భూములు, జీవీఎంసీ ఓపెన్ స్థలాలు, పార్కులు, రిజర్వు ప్రదేశాలు, ఇతర ఆస్తులలోకి జేసీబీ, ట్రక్కు లేదా ఇతర భారీ యంత్రాలు ప్రవేశించరాదన్నారు. అనుమతి లేకుండా ప్రభుత్వ భూములు లేదా జీవీఎంసీ భూములపై తాత్కాలిక/శాశ్వత నిర్మాణాలు, వినియోగం, ఆక్రమణలు చట్టవిరుద్ధమన్నారు.

విగ్రహాల నిమజ్జనం స్థలం మార్చండి

జీవీఎంసీ కమిషనర్‌కు మత్స్యకారుల వినతి

పెదవాల్తేరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వినాయకచవితి, విజయదశమి సందర్భంగా ఏర్పాటు చేసే విగ్రహాలను తమ ప్రాంతంలో నిమజ్జనానికి అనుమతించడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని గ్రేటర్ 19వ వార్డు పెదజాలారిపేట, వాసువానిపాలెం మత్స్యకారులు సోమవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ అధ్యక్షుడు తెడ్డు పరసన్న మాట్లాడుతూ పెదజాలారిపేటలో రెండువేలకు పైగా కుటుంబాలు నివసిస్తున్నాయని, సుమారు 350కు పైగా సంప్రదాయ బోట్లలో చేపల వేట సాగిస్తున్నామన్నారు. నాలుగేళ్లుగా వినాయకచవితి, విజయదశమి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలు పెదజాలారిపేట, లాసన్స్ బే కాలనీ తీరంలో నిమజ్జనం చేస్తున్నారని, దీంతో చేపల వేటకు వెళ్లి వచ్చేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. విగ్రహాలు సముద్రం ఒడ్డున గుట్టలుగా పేరుకుపోయి అందులోని చెక్కలు, ఇనుప మేకులు గాయపరుస్తున్నాయన్నారు. వ్యర్థాలతో మత్స్య సంపదకు అపార నష్టం కలుగుతోందని, మూడు నెలల వరకు వేట సాగని పరిస్థితి నెలకొంటోందన్నారు. గడ్డితో తయారుచేసిన విగ్రహాలు బోట్ల ఇంజన్లకు తగిలి మరమ్మతులకు గురవుతున్నాయని వాపోయారు. ఈ ఏడాది పెదజాలారిపేట, లాసన్స్‌బే కాలనీ తీరంలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అవకాశం లేకుండా చేయాలని కమిషనర్‌ను కోరారు.


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు


శాస్త్రి చరణ్‌తో రెడ్‌క్రాస్ సభ్యులు, పోలీసులు

మూడేళ్ల తర్వాత కుటుంబం చెంతకు

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ పోలీసుల చొరవ, రెడ్ క్రాస్ సేవలతో మతి స్థిమితం లేని ఓ వ్యక్తి మూడేళ్ల తర్వాత తిరిగి తన కుటుంబం చెంతకు చేరుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. కళాభారతి సమీపంలో ఓ వ్యక్తి ఒంటిపై దుస్తులు లేకుండా తిరుగాడుతున్న విషయం స్థానికులు డయల్ 112కు సమాచారం అందించారు. ఈ మేరకు ఎంవీపీ సీఐ మురళి సిబ్బందిని పంపి, మతిస్థిమితం లేని వ్యక్తిని రెడ్ క్రాస్ హోంలెస్ షెల్టర్ మేనేజర్‌ను సంప్రదించి పెదవాల్తేరు మానసిక ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందించారు. మానసిక స్థితి కొంత మెరుగవడంతో తన పేరు శాస్త్రి చరణ్(32)గా పేర్కొన్నాడు. తనది పశ్చిమ బెంగాల్‌లోని ఇండస్ బనకూర సమీపంలోని దామూర్ ప్రాంతంగా చెప్పాడు. దీంతో పోలీసులు సమాచారాన్ని అతడి భార్య, కుమార్తెకు చేరవేశారు. మానసిక అనారోగ్యంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం కనిపించలేదని, దీంతో అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఎంవీపీ పోలీసులు ఇండస్ పోలీసులను సంప్రదించడంతో, శాస్త్రి చరణ్ సోదరుడు మింట్ రాయ్ విశాఖ వచ్చాడు. అతడికి ఏఎస్ఐ ఆదిరాజు, బ్లూకోల్ట్ కానిస్టేబుల్ సురేష్, రెడ్ క్రాస్ మేనేజర్ మురళి శాస్త్రి చరణ్‌ను అప్పగించారు. పోలీసులు, రెడ్ క్రాస్ సేవలను చరణ్ కుటుంబ సభ్యులతో పాటు, పలువురు ప్రశంసించారు.

ఆర్పీల నియామకంలో వివాదం


జోన్-3 ఏపీడీ రామును నిలదీస్తున్న డ్వాక్రా మహిళలు

మద్దిలపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక 22వ వార్డు కళాభారతి పార్కులో సోమవారం ఆర్పీల నియామకంలో వివాదం చోటుచేసుకుంది. ఉద్యోగుల భార్యలనే నెపంతో ఇద్దరు ఆర్పీలను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ డ్వాక్రా మహిళలు నిరసనకు దిగారు. ఉద్యోగుల భార్యలు ఐదుగురు ఆర్పీలుగా ఉంటే ఇద్దరినే ఎందుకు తీసేశారని యూసీడీ అధికారులకు నిలదీశారు. తొలగించిన ఆర్పీలను విధుల్లోకి తీసుకోవాలని, లేదంటే డ్వాక్రా గ్రూపుల నుంచి వైదలగుతామని హెచ్చరించారు. కాగా 22వ వార్డులో చంద్రకళ, జానకి, అమ్మాజీ, అన్నపూర్ణ, షేక్ బాబా ఆర్పీలుగా పనిచేస్తున్నారు. ఆర్పీ భారతితో చంద్రకళ, జానకిలకు విభేదాలున్నాయి. దీంతో వారు ఆర్పీలుగా పనిచేయడం నిబంధనలకు విరుద్ధమంటూ యూసీడీ పీడీకి కార్పొరేటర్ ఫిర్యాదు చేశారు. దీంతో వారిని తొలగించి కొత్తవారిని నియమించేందుకు యూసీడీ ఏపీడీ రాము పార్కులో ప్రక్రియ నిర్వహించారు. దీంతో డ్వాక్రా మహిళలు ఎదురుతిరిగారు. మెప్మా డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆర్పీలను తొలగించారని, ఆయనతోనే చెప్పుకోవాలని యూసీడీ అధికారులు సమాధానమిచ్చారు. దీంతో డ్వాక్రా మహిళలు మెప్మా డెరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని, అంతవరకు కొత్త ఆర్పీలు మాకొద్దని వెళ్లిపోయారు.

పేరుకే పెద్ద కూడలి... బస్ షెల్టర్‌కు లేదు గతి!

హనుమంతువాక జంక్షన్‌లో పరిస్థితి

ఆరిలోవ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖలో హనుమంతవాక కూడలికి పెద్ద జంక్షన్‌గా పేరుంది. అయితే ఇక్కడి బీఆర్‌టీఎస్ రోడ్డులో కనీసం బస్ షెల్టర్ కూడా లేని పరిస్థితి నెలకొంది. దీంతో ఎండా, వానలోనే బస్సుల కోసం ప్రయాణికులు నిరీక్షించాల్సిన దుస్థితి ఎదురవుతోంది. బీఆర్‌టీఎస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా సుమారు 12 ఏళ్ల కిందట ఇక్కడ ఉన్న బస్ షెల్టర్‌ను తొలగించారు. కానీ ఇప్పటివరకు తిరిగి నిర్మించే దిశగా జీవీఎంసీ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై పలుమార్లు స్థానికులు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదు. ఫలితంగా ఎండా, వానలో బస్సుల కోసం పడిగాపులు పడుతున్నామని ఈ ప్రాంత వాసులు వాపోతున్నారు.


హనుమంతువాక కూడలిలో ఎండలో ప్రయాణికుల నిరీక్షణ

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు భీమిలి విద్యార్థులు

భీమునిపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సీబీఎం, బీజీఎం పాఠశాలల విద్యార్థులు రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. నగరంలోని సీతమ్మధార శ్రీకృష్ణ మందిరంలో విశాఖ యోగా స్పోర్ట్సు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించారు. వీటిలో తేజ యశ్వంత్, జయంత్, మౌనిక, సూర్యకుమారి పలు విభాగాల్లో ప్రతిభ చూపి ఈనెల 27న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను సోమవారం ఆయా పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్లు విజయకుమారి, పి. సుందర్ చంద్, ఛైర్మన్ వర్మ అభినందించారు. అలాగే జేజే పవర్ జిమ్ విద్యార్థిని మల్లేటి మోనికా 21-25 వయస్సు గ్రూపులో ద్వితీయ స్థానం పొంది, వచ్చే నెల 6, 7 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా ద్వారకా తిరుమలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు జిమ్ ట్రైనర్, జాతీయ యోగా రిఫరీ నల్ల శ్రీనివాసరావు తెలిపారు.

కృష్ణాపురం బాలికకు అభినందనలు

పద్మనాభం : రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికైన కృష్ణాపురం గ్రామానికి చెందిన బాలిక చలపాక శిరీషను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అభినందించారు. విశాఖ యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో బాలిక ప్రథమ బహుమతి పొందడమే కాకుండా తాడేపల్లిగూడెంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఈమేరకు తగరపువలసలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలికను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలో కూడా ప్రతిభ చూపి జిల్లాకు, నియోజకవర్గానికి పేరు తీసుకురావాలని ఆశీర్వదించారు.


శిరీషను అభినందిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

న్యాయం చేయాలంటూ 'పల్లా'కు జిల్లా వీఆర్‌వోల వినతి

» గత వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందంటూ ఆవేదన

గాజువాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గత 15 ఏళ్లుగా వీఆర్‌ఏ టూ వీఆర్‌వోలుగా విధులు నిర్వర్తిస్తున్న తమకు న్యాయం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు జిల్లా వీఆర్‌వో సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో పల్లాను కలిసిన వీఆర్‌వోలు తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో సుమారు 3,786 మంది వీఆర్‌ఏలుగా విధులు నిర్వర్తిస్తున్న తమకు 2019లో గత వైసీపీ ప్రభుత్వం గ్రేడ్-2 వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించి సచివాలయాల్లో రెండేళ్ల పాటు విధులు నిర్వహించాలంటూ పలు ఆంక్షలతో ఉత్తర్వులు ఇచ్చిందని పల్లాకు తెలియజేశారు. అయితే ఆర్డర్ కాపీలో ఉన్న ప్రకారం తాము అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులమై ఐదేళ్లయినా తమకు ఇంతవరకు న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2016లో వీఆర్‌ఏలను గ్రేడ్-1 వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించడం జరిగిందని, కానీ గత వైసీపీ ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని వాపోయారు. ఎన్నికలకు ముందు తాము టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు కలిసి సమస్యను వివరిస్తే తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. తమకు గ్రేడ్-1 వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించి న్యాయం జరిగేలా చూడా లని వారు పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ అంశాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా హామీ ఇచ్చినట్టు వీఆర్‌ఏల సంఘం నాయకులు పేర్కొన్నారు.


పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌వోల సంఘం ప్రతినిధులు


స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు

ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. ఎంవీపీ కాలనీలోని సత్యసాయి విద్యా విహార్‌లో యూకేజీ చిన్నారులు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సోమవారం వివిధ వేషధారణలతో పాఠశాలకు వచ్చారు. అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి, సుభాష్ చంద్రబోస్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాణీ రుద్రమదేవి వంటి వేషాలతో అలరించారు. చిన్ననాటి నుంచే సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహిస్తున్న పిల్లల తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు చిన్నారులను అభినందించారు.

సమగ్ర ప్రణాళికతోనే నగరాల నిర్మాణం


సమావేశంలో పాల్గొన్న క్రెడాయ్ మహిళా విభాగం సభ్యులు

మద్దిలపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నివసించదగిన నగరాల కోసం సమగ్ర ప్రణాళిక అవసరమని ఆర్కిటెక్ట్, ఏపీ క్రెడాయ్ మహిళా విభాగం సమన్వయకర్త ఎస్.మృదుల పేర్కొన్నారు. క్రెడాయ్ ఆధ్వర్యంలో సోమవారంనివసించదగిన నగరాల నిర్మాణం- అభివృద్ధి చెందుతున్న పట్టన జీవనశైలితో రియల్ ఎస్టేట్ సమలేఖనం చేయడం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ, జనాభా మార్పులు రియల్ ఎస్టేట్ రంగం విధానంలో మార్పులు తేవాలని సూచించారు. గ్రీన్ మొబిలిటీ, మిశ్రమ వినియోగ భవనాలు, ప్రజా ప్రదేశాల సమీకరణ వంటి అంతర్జాతీయ నమూనాలు ప్రస్తావిస్తూ పర్యావరణ ప్రభావం తగ్గించి జీవన ప్రమాణాలు పెంచే వాతవరణంగల నిర్మాణాలు అవసరమన్నారు. భవిష్యత్తు నగర ప్రణాళికలో స్మార్ట్ టెక్నాలజీ కీలకమన్నారు. అనంతరం యోగా ధ్యాన వర్క్‌షాప్ నిర్వహించారు. శ్వాస పద్ధతిలో ఒత్తిడి నియంత్రణ, సంపూర్ణ ఆరోగ్య సాధనపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ ప్రతినిధులు బాయిన శ్రీనివాస్, వి. ధర్మేంధర్, బి.రాజా శ్రీనివాస్, టి.శ్రవంతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు దేశభక్తి కలిగి వుండాలి


మీగడ రామలింగస్వామిని సత్కరిస్తున్న కృష్ణ కళాశాల అధ్యాపకులు

మద్దిలపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు దేశభక్తి, మంచి వ్యక్తిత్వం కలిగివుండాలని రచయిత డాక్టర్ మీగడ రామలింగస్వామి పేర్కొన్నారు. డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులు-వ్యక్తిత్వ వికాసం అంశంపై నిర్వహించిన చర్చగోష్ఠిలో ఆయన మాట్లాడారు. వ్యక్తిత్వమే మంచి ఆభరణమమన్నారు. ఉద్దేశం వివరించడంలో భావ ప్రకటన అవసరమన్నారు. క్రమశిక్షణ, విలువలు, స్నేహం, ప్రేమ అలవర్చుకోవాలని అప్పుడే పరిపూర్ణులవుతారన్నారు. అనంతరం అధ్యాపకులు రామలింగస్వామిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు కుసుమకుమారి, శారద, గోపాల్‌నాయుడు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి


జడ్సీ కనకమహాలక్ష్మికి సమస్యను వివరిస్తున్న కాలనీవాసులు

కొమ్మాది, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ ఏడో వార్డు పరిధిలోని ఆదిత్య నగర్‌లో ఓ వ్యక్తి రహదారిని ఆక్రమించి దారి లేకుండా చేస్తున్నారని స్థానికులు జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మికి ఫిర్యాదు చేశారు. సోమవారం వారు జోనల్ కార్యాలయంలో జడ్సీని కలిసి వినతిపత్రం అందించారు. కాగా పీజీఆర్ఎస్‌కు 19 అర్జీలు అందినట్టు జడ్సీ తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి ఎనిమిది, వాటర్ సప్లై విభాగానికి ఆరు, రెవెన్యూ 1, విద్యుత్ విభాగానికి 2, పబ్లిక్ హెల్త్ విభాగానికి ఒక వినతి వచ్చిందన్నారు.

యువత నైపుణ్యం పెంపొందించుకోవాలి : వీసీ

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకోవాలని ఏయూ వీసీ ఆచార్య జీ పీ రాజశేఖర్ అన్నారు. పరిపాలన భవనం వద్ద స్కిల్ ఇండియాలో భాగంగా నాస్కామ్ కేంద్రం సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వికసిత్ భారత్ సాకారం చేయడానికి యువత సహకారం అవసరమన్నారు.

త్వరలో అందుబాటులోకి గ్లాస్ బ్రిడ్జి

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్


పనులను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రణవ్‌గోపాల్. పక్కన కమిషనర్ విశ్వనాథన్, సీఈ వినయకుమార్

విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిపై నిర్మిస్తున్న గ్లాస్ బ్రిడ్జిని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. ఆయన కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి సోమవారం కైలాసగిరిని సందర్శించి అభివృద్ధి పనులు పరిశీలించారు. జూన్ నెలాఖరుకు పూర్తి కావలసిన పనులు ఇంకా జరుగుతుండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏదేమైనా నాణ్యత ముఖ్యం కాబట్టి ఈ నెలాఖరుకు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ నెల 18న త్రిశూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఈ వినయ్‌కుమార్, ఎస్ఈలు భవానీశంకర్, మధుసూదనరావు, ఈఈలు రామరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

13న హిచ్‌కాక్ 126వ జయంతి వేడుకలు

డాబాగార్డెన్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ సినిమా దర్శకుల్లోని మేటి దర్శకుడిగా ఆల్ ఫ్రైడ్ హిచ్‌కాక్ 126వ జయంతి వేడుకలను వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించనున్నట్టు కార్యదర్శి ప్రకాశరావు తెలిపారు. ఈ సందర్భంగా హిచ్‌కాక్ దర్శకత్వం వహించిన 'నార్త్ బై నార్త్ వెస్ట్' చిత్రాన్ని విశాఖ పౌర గ్రంథాలయంలో ప్రదర్శిస్తున్నామని తెలిపారు. ఈ చిత్రనికి తిలకించడానికి ప్రవేశం ఉచితమన్నారు. సినీ ప్రియులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పీ4 పూర్తిగా స్వచ్ఛందం

» కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల అనుగుణంగా సచివాలయాల వారీగా పీ4 మార్గదర్శులు మ్యాపింగ్ ప్రక్రియను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరెంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో అధికారులతో ఆయన మాట్లాడుతూ పీ4 పూర్తిగా స్వచ్ఛంద కార్యక్రమని ఎవరిపై ఒత్తిడి లేదని, వీటికి అనుగుణంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నగరంలో ఉన్న సచివాలయాల్లో 10 మంది మార్గదర్శులను గుర్తించి బంగారు కుటుంబాలకు అనుసంధానం చేయాలని సూచించారు. ఆసక్తి ఉన్న పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు మండలాలను దత్తత తీసుకునే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ఇప్పటికే దివీస్ సంస్థ మండలాన్ని దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు.

నేడు బీచ్‌రోడ్డులో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర

మహారాణిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నేడు బీచ్‌రోడ్డులో 'హర్ ఘర్ తిరంగా' యాత్ర మంగళవారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి79 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా నేడు బీచ్‌రోడ్డులో ఉదయం 6:30 నుంచి కాళీమాత ఆలయం నుంచి వైయమ్‌సీఏ వరకు భారీ ఎత్తున తిరంగా యాత్ర కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ సాంస్కృతి కార్యక్రమాలు, కళారూపాల ప్రదరన నిర్వహించనున్నట్టు తెలిపారు.

పద్మశాలి నూతన సంఘం ఎన్నిక

సీతంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట మధురానగర్‌లో గల పద్మశాలి భవన్‌లో జిల్లా సంఘం పెద్దలు తెడ్లపు వెంకటేశ్వరరావు, కులపాక సన్యాసిరావు, బీపీఎస్ కల్యాణి, కాకి భవాని ఆధ్వర్యంలో భక్త మార్కండేయ పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గం ఎన్నికలను నిర్వహించారు. సేవా సంఘం అధ్యక్షుడిగా గుడే రాజు, విశిష్టత గౌరవ అధ్యక్షుడిగా కరణం వెంకటేశ్వర్లు, దొడ్డి చిన్నబాబు, గౌరవ అధ్యక్షులుగా మాదాబత్తుల శ్రీను, ఇమంది అప్పారావులు, పలువురు కార్యదర్శిగా పప్పు ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా పెంటకోట శ్రీను, వానపల్లి కనకరాజు, కోశాధికారిగా ఆకుల శ్రీను, దొడ్డి వాసు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా గుదే త్రినాథ్, బడిగంటి సురేశ్, బడిగంటి శంకర్, మహిళా అధ్యక్షురాలుగా పొనగంటి పార్వతి, కార్యదర్శులుగా స్వర్ణపూడి పద్మ, తదితరులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గుదే రాజు మాట్లాడారు.

అప్పన్న ఆలయ ఇంజనీరింగ్ విభాగం తీరే వేరయ!



రోడ్డుమీద కంకర చిప్స్ రేగిన దృశ్యం



దారిలో పేరుకుపోయిన సిమ్మెంట్ బూడిదతో ఇబ్బంది పడుతున్న భక్తులు

మాధవదార, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మాధవధార కొండపై ఉన్న సింహాచల దేవస్థానం ఉపదేవాలయాలకు చేరుకునే రోడ్డును మొక్కుబడికి అభివృద్ధి చేసినట్టు చేశారు. అప్పన్న ఆలయ ఇంజనీరింగ్ విభాగం గిరిప్రదక్షణ సమయంలో కొండ మీద ఉన్న 10 అడుగుల బీటీరోడ్డుకు ఇరువైపులా సిమ్మెంట్ క్రషర్ బుగ్గి, కంకర చిప్స్ వేసి చేతులు దులుపుకున్నారు. ఇప్పుడా రోడ్డును చూసి విమర్శించని భక్తులు లేరంటే అతిశయోక్తి కాదు. గిరి ప్రదక్షణ సమయంలో బీటీరోడ్డు వేసి భక్తులకు సౌకర్యం కల్పించామనే భ్రమలో ఆలయ ఇంజనీరింగ్ విభాగం ఉంది. కానీ ఇప్పుడా రోడ్డు పరిస్థితి మరితం అధ్వానంగా మారింది. వేసి కంకర చిప్స్, సిమ్మెంట్ బుగ్గి పైకి రేగిపోయాయి. భక్తులు ఇప్పుడు వాటి మీద నడవాలంటే చాలా ఇబ్బంది పడుతున్నారు. ద్విచక్రవాహనాలు ఆ కంకర చిప్స్‌మీద జారిపోతున్నాయని, ఏదన్న ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆలయానికి వచ్చిన భక్తులు ప్రశ్నిస్తున్నారు. సిమ్మెంట్ బుగ్గి గాలికి రేగి కళ్లల్లో పడుతోందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి సంవత్సరం గిరిప్రదక్షణ సమయంలో మాధవధార కొండ దగ్గర ట్యాప్‌లు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తారు. కానీ ఆ పర్వదినం అయిన రెండు రోజుల వ్యవధిలోనే ఏర్పాటు చేసిన ట్యాప్‌లు దొంగలపాలవుతున్నాయి. ఇది ప్రతి సంవత్సరం ఉండే తంతేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. దేవస్థానం ఆధ్వర్యంలో జరిగే పనుల్లో ఇంత నిర్లక్ష్యం తగదని పలువురు అంటున్నారు. ఇప్పటికైన అధికారలు స్పందించి ఈ సమస్యకు స్వస్తి పలకాలని భక్తులు కోరుతున్నారు.

జాతీయ సైక్లిస్ట్‌కు రూ.1లక్ష ఆర్థిక సాయం

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ, అంతర్జాతీయ సైక్లింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలలో పాల్గొనేందుకు అవసరమైన టైమ్ ట్రయిల్ బైక్ కొనుగోలు చేసుకునేందుకు జాతీయ సైక్లిస్టు కె.వంశీ కిరణ్‌కు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సోమవారం రూ.1లక్ష ఆర్థిక సాయం చేశారు. జాతీయ గేమ్స్, ఆలిండియా యూనివర్సిటీ సైక్లింగ్ టోర్నీలలో ప్రాతినిథ్యం వహించిన వంశీ కిరణ్, తదుపరి టోర్నీలలో పాల్గొని, పతకాలు సాధించేందుకు ఆధునిక మెటీరియల్‌తో కూడిన టైమ్ ట్రయిల్ బైక్ (సైకిల్)ను కొనుగోలు చేసుకునేందుకు ఆర్థిక సాయం అందించాలని జిల్లా కలెక్టర్‌ను అభ్యర్థించారు. దీంతో స్పందించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సైకిల్ కొనుగోలు నిమిత్తం తన సొంత నిధుల నుం చి రూ.50వేలు, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ నిధుల నుంచి రూ.50 వేలు మంజూ రు చేసి సోమవారం అందించారు. ఒలిపిక్ స్థాయి టోర్నీలో పతకాలు సాధిం చి నగరానికి ఖ్యాతి తీసుకురావాలని ఆకా ంక్షించారు. ఈ కార్యక్రమంలో జాయి ంట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, రెవెన్యూ అధి కారి భవాని శంకర్, శాప్ బోర్డు డైరక్టర్ ఎంవీ.దుర్గారమేశ్‌కుమార్, డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి డిబేట్ పోటీల్లో విజేతగా నగరవాసి



తులసికి సర్టిఫికేట్ అందిస్తున్న రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ యాక్టు)పై రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన డిబేట్ పోటీల్లో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల విద్యార్థిని ఎస్.తులసి ప్రథమ స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. విజయవాడ ఎస్ఆర్ఆర్, సీవీఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోటీల్లో తులసి అద్భుతమైన ప్రతిభను కనబరిచి విజేతగా నిలిచిందని పేర్కొన్నారు. రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ తులసి బహుమతి అందించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై జరిమానాలు



దుకాణదారుడకు జరిమాన విధిస్తున్న అధికారులు

సీతమ్మధార, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్ 3 పరిధి సీతమ్మధార, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంచులు వాడకం అధికంగా ఉన్న దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా చిరువర్తకులు, హోల్‌సేల్ దుకాణదారులకు సింగ్‌యూజ్ ప్లాస్టిక్ సంచులను వాడకూడదని అవగాహన కల్పించారు. అవి వాడుతున్న వారకి జరిమాన విధించి, వారి దగ్గర నుంచి ప్లాస్టిక్ సంచులను స్వాధీనం చేసుకున్నారు. సింగ్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని ప్రోత్సహించవద్దని, ఎవరైన వాడినట్టు కనిపిస్తే ఉపేక్షించవద్దని పలువురు వినియోగదారులకు అవగాహన కల్పించారు.

అంతర్జాతీయ వాలీబాల్ టోర్నీకి ఎంపికలు రేపు

విశాఖపట్నం, స్పోర్ట్స్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): చైనాలో జరగనున్న అంతర్జాతీయ స్కూల్స్ అండర్-15 వాలీబాల్ చాంపియన్‌షిప్ టోర్నీలకు జట్టు ఎంపికలు రైల్వే కాలనీలో జీవీఎంసీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించనున్నామని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖ కార్యనిర్వాహక కార్యదర్శి వి. దేముడు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఉదయం 9.00 గంటలకు హాజరుకావాలని సూచించారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 18న విజయవాడలోని కేబీసీ జడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో జరగనున్న రాష్ట్ర జట్టు ఎంపికలలో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. అలాగే రాష్ట్ర జట్టుకు ఎంపికైనవారిని త్వరలో జాతీయ స్థాయిలో ఎంపిక చేసి భారత జట్టులో స్థానం కల్పిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 9492900200 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

'భారతీయ వైజ్ఞానిక వైభవం' పుస్తకావిష్కరణ

సీతంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): భారతీయులకు అనాదిగా శాస్త్రీయ దృక్పథం ఉందని, ఈనాటి వైజ్ఞానిక పురోగతికి మూలాలు మన శాస్త్ర గ్రంథాల్లో ఉన్నాయని ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య జి.నాగేశ్వరరావు అన్నారు. బీవీకే కళాశాలలో రచయిత చెరుకూరి సర్వేశ్వరవావు రచించిన 'భారతీయ వైజ్ఞానిక వైభవం' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయుర్వేదం ప్రపంచంలోనే అతి ప్రాచీన వైద్య విజ్ఞానమని పాశ్చాత్య దేశాలు భారత చరిత్రను వక్రీకరించారని, ఈ పుస్తకం ద్వారా భారత వైజ్ఞానికుల కృషిని తెలుగులో చక్కని సరళమైన శైలిలో అందించారని రచయితను అభినందించారు. విజ్ఞాన భారతి జాతీయ కార్యదర్శి కొంపెల్ల సుబ్బరాయశాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్లేషకుడు, రచయిత డాక్టర్ డీవీ సూర్యారావు పుస్తక సమీక్ష చేశారు. రచయిత సర్వేశ్వరరావు మాట్లాడుతూ ఈ పుస్తకం రాయడానికి ప్రేరణను తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా డాక్టర్ కొచ్చెర్లకోట సత్యనారాయణమూర్తి, ఆచార్య పీఎస్ఆర్ అవధాని, ఆచార్య కె.విశ్వనాథ్, శేఖరమంత్రి ప్రభాకరరావు పాల్గొన్నారు.

ప్రజల కోసం కష్టపడేది టీడీపీ మాత్రమే

» టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్



కూటమి ఏడాది పాలన కరపత్రాలు చూపిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకోసం నిరంతరం కష్టపడేది టీడీపీ అని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్ అన్నారు. జీవీఎంసీ 45వ వార్డు అధ్యక్షుడు భరణికాన రాజు ఆధ్వర్యంలో తారకరామనగర్‌లో 'తొలి అడుగు' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎండీ నజీర్ మాట్లాడుతూ టీడీపీ ఎప్పుడూ ప్రజల పక్షాన్నే ఉంటుదని అటువంటి పార్టీని ఆదరించాలని కోరారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నజీర్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా!

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా ఉన్న విషయం తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ కార్యాలయం తెలిపింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. నకిలీ ప్రొఫైల్‌ను అనుసరించవద్దని, వాటిపై స్పందించవద్దని కోరింది. ఈ ఖాతాను అధికారికంగా గుర్తించలేదని పేర్కొంది. collectorpeshi@gmail.comతో లింక్ అయినా ఖాతా మాత్రమే అధికారికమైనదని, ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కార్యాలయం సూచించింది.



నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో కార్మికులు, ఏఐటీయూ సభ్యులు

ఉచిత బస్సు ప్రతిపాదనను పునఃపరిశీలించాలి

» ఆటోరిక్ష కార్మిక సంఘం

మహారాణిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఉచిత బస్సు ప్రతిపాదనను పునఃపరిశీలించాలని జిల్లా ఆటో రిక్షా కార్మిక సంఘం డిమాండ్ చేసింది. జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులులు సీహెచ్.కాసుబాబు, షేక్ రెహమాన్ మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకుని ప్రభుత్వ ఉద్యోగాలు లేక ఆటో నడుపుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నామని, ఫైనాన్స్‌లో ఆటోలు కొనుగోలు చేసి వడ్డీలు కట్టుకుంటూ బతుకుతున్నామని అన్నారు. ఈ నెల 15 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సులు పెట్టడం వల్ల ఆటో కార్మికుల ఆదాయానికి గండి పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో డ్రైవర్ల ఆదాయం మెరుగుపడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కేవీలో హీరక్ పంక్ టెస్టింగ్ క్యాంప్ ప్రారంభం



స్కిట్ ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

అక్కయ్యపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేరులో మంగళవారం హీరక్ పంక్, గోల్డెన్ ఆరో టెస్టింగ్ క్యాంప్ సోమవారం ప్రారంభమైంది. ఇందులో అమరావతి రీజియన్, హైదరాబాద్ రీజియన్ నుంచి 32 పాఠశాలల విద్యార్థులు 220 మంది పాల్గొన్నారు. ఈ మేరకు ఎల్‌వోసీ జ్యోతి శిబిరం ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని విద్యార్థులు నిర్వహించిన స్కిట్, నృత్యం అందరిని అలరించాయి. ఈ క్యాంప్ మూడు రోజులు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రమశిక్షణ, సమయపాలన, స్వచ్ఛత, సహకారం వంటివాటిపై అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆహార కల్తీ నియంత్రణకు 'షీ' టీమ్స్

... 5వ పేజీ తరువాయి

ప్రతీరోజూ 16 బృందాలు కనీసం 50 చోట్ల తనిఖీలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. ఆయాచోట్ల వినియోగించే ముడిపదార్థాలు, విక్రయించే ఆహారం నాణ్యత, వంటశాల పరిశుభ్రతను పరిశీలిస్తాయన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌ను ఉపయోగించకుండా బయో డీగ్రేడబుల్ ప్లాస్టిక్ లేదా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించేలా చర్యలు తీసుకుంటారన్నారు. కొన్నాళ్ల పరిశీలించిన తర్వాత ఇంకా తనిఖీలను పెంచాల్సిన అవసరం ఉందని గుర్తిస్తే ప్రతీజోన్‌కు అదనంగా రెండు చొప్పున బృందాలను నియమిస్తామన్నారు. ప్రతిరోజూ తనిఖీలు జరుగుతాయనే విషయం తెలిసినట్టయితే వ్యాపారులు ఆహార నాణ్యత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్‌లో పాతుకుపోయిన ఎస్‌ఐలు

... 5వ పేజీ తరువాయి

ఒకరిద్దరు తమను వేరొకచోటకు బదిలీ చేయాలని తమ పైఅధికారులకు విజ్ఞప్తి చేసినా ఉన్నతాధికారుల జోక్యం లేకుండా బదిలీ చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారని ఎస్‌ఐలు వాపోతున్నారు. ఎస్‌ఐలు లాంగ్ స్టాండింగ్ వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ఈ వ్యవహారంపై ఇప్పటికైనా పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి దృష్టిసారించాలనే డిమాండ్ డిపార్టుమెంట్ నుంచే వినిపిస్తోంది.

చెరువులకు పునరుజ్జీవం

... 5వ పేజీ తరువాయి

చేపట్టారు. మొదటి రెండు చెరువులకు పక్కనున్న గెడ్డల ద్వారా నీరు వచ్చే అవకాశం ఉండగా, దేవరవాణికి ఆ సౌకర్యం లేదు. దాంతో బాడవ చెరువు నుంచి పైపుల ద్వారా దేవరవాణికి నీరు వచ్చేలా చేశారు. ఇప్పుడు ఆ చెరువు నీటితో కళకళలాడుతోంది. ఈ కాస్కేడ్‌లో నాలుగోది కంబాల చెరువు. దానిని కూడా పూర్తిచేసేందుకు పనులు చేపడుతున్నారు. అది కూడా పూర్తయితే చెరువుల పునరుద్ధరణ పథకంలో తొలి దశ 'కాపులుప్పాడ కాస్కేడ్' రైతులకు అందుబాటులోకి వస్తుంది. ఆ తరువాత దశలో రాంపురం, నరవ కాస్కేడ్ పనులు చేపడతారు.

ఇవన్నీ గొలుసుకట్టు చెరువులు

ఎస్.విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

పూడుకుపోయి, ఆక్రమణలకు గురికాకుండా ఉన్న చెరువులను పునరుద్ధరించడానికే ఈ పథకం చేపట్టాం. ఇవన్నీ గొలుసుకట్టు చెరువులు. ఒక చెరువు నిండిన తరువాత దాని నుంచి మరో చెరువుకు నీరు వెళుతుంది. దాంతో అన్ని నీటితో కళకళలాడతాయి. వీటిని పునరుద్ధరించడం వల్ల స్థానిక రైతులకు పంటలు పండించుకునే వెసులుబాటు కలుగుతుంది. జీవావరణం ఇంతకు ముందులా పునరుద్ధరణ జరుగుతుంది. ఏడాది కాలంలోనే మొదటి దశ పూర్తిచేయడం సంతోషంగా ఉంది.

స్టీల్‌ప్లాంటులో ప్రమాదం... కాంట్రాక్టు కార్మికుడి మృతి

... 5వ పేజీ తరువాయి

అంగీకరించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. స్టీల్‌ప్లాంటు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీపీ విభాగంలో...

ఇదిలావుండగా సీవో సీసీపీ విభాగంలో అగనంపూడి ప్రాంతానికి చెందిన టి.అప్పారావు (56) క్లీనింగ్ పనులు చేసేవారు. ఆదివారం మధ్యాహ్నం విభాగంలో విధులు నిర్వర్తిస్తుండగా ఒక్కసారిగా పడిపోయారు. దీంతో అప్పారావును హుటాహుటిన ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందారు. అయితే దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్టీల్‌ప్లాంట్ పోలీసులు తెలిపారు.

త్వరలో అందుబాటులోకి గ్లాస్ బ్రిడ్జి

» వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్



గ్లాస్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న చైర్మన్ ప్రణవ్ గోపాల్. పక్కన కమిషనర్ విశ్వనాథన్, సీఈ వినయకుమార్

విశాఖపట్నం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రమైన కైలాసగిరిపై నిర్మిస్తున్న గ్లాస్ బ్రిడ్జిని త్వరలోనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ తెలిపారు. ఆయన కమిషనర్ విశ్వనాథన్‌తో కలిసి సోమవారం కైలాసగిరిని సందర్శించి అభివృద్ధి పనులు పరిశీలించారు. జూన్ నెలాఖరుకు పూర్తి కావలసిన పనులు ఇంకా జరుగుతుండడంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. ఏదేమైనా నాణ్యత ముఖ్యం కాబట్టి ఈ నెలాఖరుకు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ నెల 18న త్రిశూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్న ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఈ వినయ్‌కుమార్, ఎస్ఈలు భవానీశంకర్, మధుసూదనరావు, ఈఈలు రామరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ పార్కు పనులు అడ్డగింపు



పనులను అడ్డుకుంటున్న రైతులు

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం మండలం కృష్ణాపురం గ్రామంలో ఎంఎస్ఎంఈ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను గ్రామానికి చెందిన కొందరు రైతులు సోమవారం అడ్డుకున్నారు. పార్కు కోసం తీసుకున్న భూమిలో కొంతమేర తాము చెట్లు పెంచుకుని జీవిస్తున్నామని, పరిహారం ఇవ్వకుండా పనులు ఎలా చేపడతారని ఆందోళన చేశారు. ఏపీఐఐసీ అధికారులు వారికి నచ్చచెప్పారు. రెవెన్యూ అధికారులు తమకు భూమి అప్పగించారని తెలిపారు. చివరకు పద్మనాభం తహసీల్దార్ సూచన మేరకు పనులను ఏపీఐఐసీ అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. కృష్ణాపురంలో 63 ఎకరాల్లో పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. తొలి దశలో 23 ఎకరాల్లో రోడ్లు, కాలువలు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కోసం రూ.12.4 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టరుకు పనులు అప్పగించారు. ఈమేరకు కాంట్రాక్టరు పనులు చేస్తున్నారు. రెండో విడతో మిగిలిన 40 ఎకరాలను అభివృద్ధి చేశారు. కాగా రెండు నెలలు క్రితం పార్కుకు శంకుస్థాపన చేసినపుడు రైతులు అభ్యంతరం వ్యక్తం చేయలేదు. వారిని వైసీపీ నేతలు రెచ్చగొడుతున్నారన్న ఆరోపణలు విని పిస్తున్నాయి.

రోడ్డు విస్తరణకు చర్యలు

మాధవధార, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మాధవధార ఆర్అండ్‌బీ జంక్షన్ దగ్గరున్న అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు గత వైసీపీ సర్కారు హయంలో 60 అడుగుల రోడ్డు, 80 అడుగుల రోడ్డు అనే ప్రతిపాదనలు చేశారు కానీ స్థాయిలో భవనాలు కూల్చివేయాల్సి వస్తుందని వాటని పక్కన పెట్టేసి ఉన్న రోడ్డుపై యథావిధిగా కొత్త రోడ్డును వేశారు. రోడ్డు విస్తీర్ణకు అడ్డంగా ఉన్న కరెంటు స్తంభాలను పక్కకి జరపకుండా పాత రోడ్డుపై పనులు హడావిడిగా కానిచ్చేశారు. ఇప్పుడు ఈ దారిలో జీవీఎంసీ ఇంజనీరింగ్, జోన్-5 సర్వే విభాగం, టౌన్‌ప్లానింగ్ విభాగాలు రోడ్డు విస్తరణలో భాగంగా భవనాల వరకు మార్కింగ్ వేశారు. రోడ్డు విస్తరణ తప్పదని ఈ మేరకు నష్టపరిహారమా, మరో ప్రత్యామ్నాయమా అనేది ఉన్నతాధికారులు తుదిదశలో నిర్ణయిస్తారని భవనాల యజమానులతో మాట్లాడారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

» తహశీల్దార్ ఎంవీవీ.ప్రసాద్

సీతమ్మధార, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు అర్జీలు వచ్చాయని తహశీల్దార్ ఎంవీవీ.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని వారికి విద్య పరంగా అవసరమైన సర్టిఫికేట్లు సత్వరమే పరిశీలించి ధ్రువపత్రాలు మంజూరు చేస్తున్నామని అన్నారు. అనంతరం పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు సిబ్బందిని పంపించారు.

సత్వరమే పరిష్కారాని కృషి

జ్ఞానాపురం, (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే వినతులు సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అన్నారు. జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సు కార్యక్రమంలో ప్రజల నుంచి 4 ఫిర్యాదులు స్వీకరించారు. ఈ ఫిర్యాదులను సంబంధిత అధికారులకు అందజేశారు.

వైద్యులకు సమయపాలన ఎంతో అవసరం

ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎమ్ సంధ్యాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డా సంధ్యాదేవి

మహారాణిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైద్యులు ప్రతీ ఒక్కరు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆసుపత్రి విధుల్లోనే పూర్తిగా నిమగ్నమైపోవాలని ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎమ్ సంధ్యాదేవి, కేజీహెచ్ సూపరింటెండెంట్ ఐ వాణీ పేర్కొన్నారు. ఆంధ్ర వైద్య కాళాశాలలో పానగాల్ సమావేశమందిరంలో ఏఎమ్‌సీ, కేజీహెచ్ వైద్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు రోగి సేవలతో పాటు బోధన పరిశోదన కార్యక్రమాలకు అందుబాటులో ఉండడం ఎంతో ముఖ్యమని, నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలను పాటించాలని సూచించారు. సంస్థ ప్రతిష్ఠను నిలబెట్టాలని అన్నారు. ఇటీవల నగరంలో జరిగిన అగ్నిప్రమాదంలో బాధితులకు అన్ని విభాగాల వైద్యులు సేవలు అందించారలని తెలిపారు. ఆసుపత్రి నిర్వహకుల పారదర్శకత బాధ్యత, సేవలలో ఉన్నత ప్రమాణాలకు కట్టుబడి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధి నుంచి కోలుకున్న యువకులకు ఆశ్రయం



యువకులతో వాసు

అక్కయ్యపాలెం, ఆగస్టు 10 (ఆంధ్ర జ్యోతి) : మానసిక వ్యాధి నుంచి కొలుకున్న వెస్ట్‌బెంగాల్‌కు చెందిన పరమేశ్వర్ (35), జార్ఖండ్‌కు చెందిన రాహుల్ (29)లను టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగఢవాసు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలీలో పోలీసులు రెస్క్యూ చేసి జూలై 5న మానసిక ఆసుపత్రిలో చేర్పించడంతో కోలుకున్నాడని, రాహుల్‌ను న్యూ పోర్టు పోలీసుల సహకారంతో ఏయూటీడీ రెస్క్యూ చేసి ఆసుపత్రిలో చేర్పించడంతో కోలుకున్నాడని పేర్కొన్నారు. వీరి కుటుంబ సభ్యులకు అప్పగించేవరకు వసతి గృహంలో ఆశ్రయం పొందుతారని అన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఉమామహేశ్వరుడు

ఉమామహేశ్వరుడికి ప్రత్యేక పూజలు

అగనంపూడి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకాలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులకు నిర్వాహకులు ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజన, భక్తిగీతాలను ఆలపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమ్మవార్ల ఆలయాల పునర్నిర్మాణానికి శ్రీకారం

పెదగంట్యాడ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): శ్రీపెంటమాంబ ఆలయ ఆవరణలోని శ్రీమహాశక్తి, భూలోకమాంబ, దుర్గాలమ్మ, కుంచుమాంబ, మరిడిమాంబ, శ్రీశక్తి అమ్మవార్ల ఆలయాల పునర్నిర్మాణానికి ఆలయాల నిర్వాహక కమిటీ, నెల్లిముక్కు పంచాయతీ పెద్దలు సోమవారం శ్రీకారం చుట్టారు. ఆలయాల్లో ఉన్న విగ్రహాలను తీసి వాటికి ప్రత్యేక పూజలు చేసి భద్రపరిచారు. ఆలయాల తొలగింపు, నూతన ఆలయాల నిర్మాణ పనులు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకట రమణారెడ్డి, వై.శ్రీనివాసరావు, జి.సత్యారావు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఖోఖో జట్లకు విద్యార్థుల ఎంపిక

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కొమ్మాదిలోని జిల్లా క్రీడాభివృద్ధి ప్రాంగణంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి బాలబాలికల ఖోఖో జట్టు ఎంపిక పోటీల్లో అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు స్కూల్ హెచ్ఎం ఎంఎల్ఎస్ కాంతం ఒక ప్రకటనలో తెలిపారు.

బాలుర జట్టుకు పి.లోవకుమార్, డి.రమేశ్, ఆర్.తరుణ్‌కుమార్, ఎస్.సంతోశ్ కుమార్, బి.మణికంఠ, బాలిక జట్టుకు ఆర్.ఢిల్లేశ్వరి, ఆర్.అఖిల, కె.శరణ్య, ఎల్.నాగశిరీష, డి.గీత, కె.రూప ఎంపికయ్యారన్నారు. సోమవారం స్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మహ్మద్ ఇస్మాయిల్ , తదితరులు అభినందించారు. త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు రాణించాలని వారు ఆకాంక్షించారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 46, వంకాయలు (తెలుపు) 30, వంకాయలు (నలుపు) 30, బెండకాయలు 30, పచ్చిమిర్చి 70, కాకరకాయలు 28, బీరకాయలు 24, ఆనపకాయ 22, కాలీఫ్లవర్ 34, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 28, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 30, అల్లం (పాతది) 70, బరబాటి 22, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 50, ముల్లంగి 26, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 30, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 36, దేముడు చిక్కుడు 78, గోరుచిక్కుడు 34, బ్రకోలి 45, కూరపెండలం 26, పనసపొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట)4, పాలకూర (కట్ట)3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, కర్రపెండలం 24, మామిడిఅల్లం 56, బొప్పాయి 36, బూడిద గుమ్మడికాయ 20, జామకాయలు కిలో 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	93
లైవ్ ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

జీవీఎంసీ కమిషనర్, ఎమ్మెల్యే విస్తృత పర్యటన

» పలు సమస్యలను పరిష్కరించాలని వేడుకున్న ప్రజలు
» సానుకూలంగా స్పందించిన కమిషనర్ కేతన్ గార్గ్

గాజువాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గాజువాక నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోమవారం విస్తృతంగా పర్యటించారు. గాజువాకలోని ప్రధాన సమస్యలనుఎ కమిషనర్‌కు ఎమ్మెల్యే వివరించారు. గాజువాక వంద అడుగుల రోడ్డులో వారు పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరారు. వంద అడుగుల రోడ్డులో ఐలాండ్ ఏర్పాటు చేయాలని, గాజువాక బీసీ రోడ్డు నుంచి కాకతీయ ఐటీఐ వరకు సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలని, తమకు ఎంతో ఇబ్బందికరంగా ఉన్న డంపింగ్ యార్డును తరలించాలని పలువురు కమిషనర్‌కు, పల్లాకు విజ్ఞప్తి చేశారు. అలాగే గాజువాకలో గల ఆదర్శ మైదానాన్ని అభివృద్ధి చేయాలన్నారు. వీటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి తక్షణమే ప్రతిపాదనలను పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, జోనల్ కమిషనర్ శేషాద్రి, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీనివాస్, బొడ్డు నరసింహపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, మొల్లి ముత్యాలనాయుడు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

87వ వార్డులో..

కూర్మన్నపాలెం: గ్రేటర్ కమిషనర్ కేతన్ గార్గ్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు 87వ వార్డులో పర్యటించారు. సిద్ధార్థనగర్‌లో క్రీడా మైదాన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బొండా జగన్ వడ్లపూడిలో ప్రధాన రహదారి విస్తరణ, డ్రైనేజీల ఆధునికీకరణ, 12 ఎండీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయించాలని వారిని కోరారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, నాయకులు బొట్టా ప్రకాశ్, ఎస్.పెంటారావు, రాజన్‌రాజు, ఆనంద్‌కుమార్, కె.శ్రీనివాస్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ 'పల్లా'కు జిల్లా వీఆర్‌వోల వినతి

» గత వైసీపీ ప్రభుత్వం మోసం చేసిందంటూ ఆవేదన

గాజువాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత 15 ఏళ్లగా వీఆర్ఏ టూ వీఆర్‌వోలుగా విధులు నిర్వర్తిస్తున్న తమకు న్యాయం చేయాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు జిల్లా వీఆర్‌వో సంఘ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో పల్లాను కలిసిన వీఆర్‌వోలు తమ సమస్యలను వివరించి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో సుమారు 3,786 మంది వీఆర్ఏలుగా విధులు నిర్వర్తిస్తున్న తమకు 2019లో గత వైసీపీ ప్రభుత్వం గ్రేడ్-2 వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించి సచివాలయాల్లో రెండేళ్ల పాటు విధులు నిర్వహించాలంటూ పలు ఆంక్షలతో ఉత్తర్వులు ఇచ్చిందని పల్లాకు తెలియజేశారు. అయితే ఆర్డర్ కాపీలో ఉన్న ప్రకారం తాము అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులమైె ఐదేళ్లయినా తమకు ఇంతవరకు న్యాయం జరగలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 2016లో వీఆర్ఏలను గ్రేడ్-1 వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించడం జరిగిందని, కానీ గత వైసీపీ ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని వాపోయారు. ఎన్నికలకు ముందు తాము టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు కలిసి సమస్యను వివరిస్తే తమకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు. తమకు గ్రేడ్-1 వీఆర్‌వోలుగా పదోన్నతి కల్పించి న్యాయం జరిగేలా చూడాలని వారు పల్లా శ్రీనివాసరావును కోరారు. ఈ అంశాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని పల్లా హామీ ఇచ్చినట్టు వీఆర్ఏల సంఘం నాయకులు పేర్కొన్నారు.



పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌వోల సంఘం ప్రతినిధులు

'కారుమూరి'ని పరామర్శించిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్

కూర్మన్నపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి వడ్లపూడికి చెందిన ఏపీ ఆర్యవైశ్య మహాసభ మెడికల్ అండ్ హెల్త్ చైర్మన్ కారుమూరి మహేశ్ తండ్రి ఇటీవల మృతి చెందడంతో సోమవారం ఏపీ ఆర్యవైశ్య వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేశ్ ఆయన స్వగృహానికి విచ్చేసి పరామర్శించారు. మహేశ్ తండ్రి సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు కె.రాజేశ్, ఎం.వెంకటరమణ, కె.మధుసూదన్‌శెట్టి, ఎం.లింగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.



కారుమూరి మహేశ్‌ను పరామర్శిస్తున్న రాకేశ్, తదితరులు

ప్రాంతీయ ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేయండి

అగనంపూడి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి అభివృద్ధికి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. ప్రాంతీయ ఆస్పత్రి డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులుగా నియమితులైన దాసరి త్రినాథ్, డొక్కా రమేశ్, కోసూరి తాతారావు, గజ్జిల రమణమ్మల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పల్లా మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో రోగులకు మెరుగైన సేవలతో పాటు అన్ని రకాల మౌలికవసతుల కల్పనకు సభ్యులు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న భవన నిర్మాణ పనులను త్వరితంగా పూర్తిచేసి వంద పడకలను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ పర్సన్ ఇన్‌చార్జి చైర్మెన్ కోన తాతారావు, డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యుడు మొల్లి ముత్యాలు, కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మీప్రసాద్, రౌతు శ్రీనివాస్, సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ, ఏవో రవిరాజు, టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దేశంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ స్థలాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

కూర్మన్నపాలెం, ఆగస్టు 11 (ఆంధ్ర జ్యోతి): జీవీఎంసీ 88వ వార్డు పరిధి దువ్వాడ సెక్టర్-1 సర్వే నంబర్ 134/1, 2, 3, 4, 5, 6లలో ఏపీఐఐసీకి చెందిన భూములు ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్నాయి. ఆయా స్థలాలు ఆక్రమణలకు గురవుతున్న నేపథ్యంలో వాటి పరిరక్షణకు అధికారులు సమాయత్తమయ్యారు. తమ స్థలాల్లోని ఆక్రమణలను అడ్డుకుంటూ అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. ఏపీఐఐసీ భూములను ఎవరైనా ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహచలం, ఐలా కమిషనర్ ఎ.కిశోర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ సిబ్బంది ఒమ్మి నాయుడు, చిరంజీవి, గొర్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమిత స్థలంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన ఏపీఐఐసీ సిబ్బంది

కేజీహెచ్‌లో మొరాయించిన సీటీ స్కాన్

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కేజీహెచ్ క్యాజువాల్టీలో ఏర్పాటుచేసిన సీటీ స్కాన్ మెషిన్ తరచూ మొరాయిస్తోంది. దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెలలో ఇప్పటికి మూడోసారి ఇదే పరిస్థితి ఎదురయిందంటున్నారు. రెండు రోజులుగా మెషిన్ పని చేయకపోవడంతో రోగులకు ఇబ్బందిగా మారుతోంది. కేజీహెచ్‌లో ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ రోగులకు అవసరమైన సీటీ స్కాన్ చేయించేందుకు టెస్లా సెంటర్ లో ఒక మెషిన్ ఏర్పాటుచేయగా, అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రిలో చేరిన వారికి క్యాజువాల్టీలో ఒకటి ఏర్పాటు చేశారు. టెస్లా సెంటర్‌లో మెషిన్‌ను ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా, క్యాజువాల్టీలోమెషిన్‌ను ప్రైవేటు సంస్థ నిర్వహిస్తోంది. కొన్నాళ్లుగా ఇది తరచూ మొరాయిస్తుండ డంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బాధితులను టెస్లా సెంటర్‌కు తీసుకెళ్లాల్సి వస్తోంది. ఎప్పటికప్పుడు మెషిన్ మొరాయిస్తున్నా సంస్థ పట్టించుకోవడం లేదంటున్నారు. దీని ద్వారా ప్రతిరోజూ 30 మందికి పరీక్ష చే స్తుంటారు. రెండురోజులుగా వారందరినీ టెస్లా సెంటర్‌కు పంపడంతో అక్కడ తాకిడి పెరిగింది.

పరిశోధనలపై విద్యార్థులు పట్టు సాధించాలి

అగనంపూడి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వినూత్న పరిశోధనలపై విద్యార్థులు పట్టు సాధించాలని ప్రొఫెసర్ డేబాబ్రట సమంతా సూచించారు. విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో వినూత్న పరిశోధనలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు తగ్గట్టుగా విద్యార్థులు రాణించాలన్నారు. అనంతరం పరిశోధనల గురించి వివరించారు. అనంతరం ఆయనను విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.



డేబాబ్రట సమంతాను సత్కరిస్తున్న దృశ్యం

'లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకు పోరాటాలు'

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్‌లను రద్దు చేసేంత వరకు పోరాటాలు చేస్తామని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులకు రక్షణ లేకుండా పోయిందని, కార్మిక హక్కుల సాధన కోసం, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు, ఉక్కు పరిరక్షణకు ఎలాంటి ఉద్యమాలకైనా సిద్ధమన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.ప్రసాద్, ఎస్‌పి నాయుడు, దేముడు, అప్పారావు, రెడ్డి, సాహు, తదితరులు పాల్గొన్నారు.

విమాన్‌నగర్ వాసుల సమస్యకు త్వరలో పరిష్కారం

» ఎయిర్ పోర్టు, హైవేలోకి ప్రవేశించాలన్నా రాంగ్ రూట్ ప్రయాణాలు » ఇబ్బందులను గుర్తించిన విప్ గణబాబు
» వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలన » గ్రీన్‌బెల్ట్ నుంచి ప్రత్యామ్నాయ రహదారి వేయాలని ఆదేశం

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : విమాన్‌నగర్ నుంచి ఎయిర్ పోర్టుకు, హైవేలోకి ప్రవేశించాలన్నా పలువురు రాంగ్ రూట్‌లో వెళుతూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న అంశంపై ప్రభుత్వ విప్ గణబాబు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా అధికారులతో కలిసి సోమవారం సాయంత్రం సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. ముఖ్యంగా విమాన్‌నగర్ కాలనీ వాసులు గతంలో హైవేలోకి ప్రవేశించాలంటే నేరుగా వెళ్లేందుకు మార్గం ఉండేది. అక్కడ ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నందున అధికారులు రోడ్డును నిలుపుదలచేసి, కాస్త ముందు ఎయిర్‌పోర్టు మలుపు వద్ద కొత్తగా సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. దీంతో వారంతా హైవేలో గాజువాక వెళ్లాలంటే కొద్దిదూరం రాంగ్ రూట్‌లో ప్రయాణించి సిగ్నల్స్ వద్దకు చేరాల్సి వస్తోంది. ఇది వాహనదారులకు ఇబ్బం దితో పాటు ప్రమాదకరంగా మారింది. ఈ సమస్య గణబాబు దృష్టికి వెళ్లడంతో ఆయన ట్రాఫిక్, ఇంజనీరింగ్ అధికారులతో వెళ్లి పరిశీలించారు. ప్రత్యామ్నాయ రహదారిని గ్రీన్‌బెల్ట్ నుంచి వేయాలని సూచించారు. ఇందుకు ఎంత ఖర్చు అవుతుందో అంచనాలను తయారు చేసి చర్యలు చేపట్టాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఈఈ దిలీప్, డీఈ ప్రవీణ్, ఎయిర్‌పోర్టు సీఐ దాశరథి, కార్పొరేటర్ బొమ్మిడి రమణ, వార్డు అధ్యక్షుడు శరగడం అరుణ్‌కుమార్, ఎలమంచిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టుకు వెళ్లే హైవే మార్గాన్ని అధికారులతో కలిసి పరిశీలిస్తున్న గణబాబు

రెండు బస్సులు ఢీ : ఐదుగురు విద్యార్థినులకు గాయాలు

పెందుర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఐదుగురు విద్యార్థినులు గాయాలకు గురయ్యారు. ఇది తమ పరిధి కానప్పటికీ పెందుర్తి పోలీసులు మానవతా దృక్పథంతో వెనువెంటనే స్పందించి క్షతగాత్రులకు వైద్య సేవలు అందేలా చూశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. విశాఖ జిల్లా పెందుర్తి పోలీసు స్టేషన్- విజయనగరం జిల్లా కొత్తవలస పోలీసు స్టేషన్ సరిహద్దున గల తాడివానిపాలెం వద్ద సోమవారం ఎల్.కోటలో గల బెహరా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్స్‌కు చెం దిన బస్సు ప్రమాదానికి గురైంది. పెందుర్తి నుంచి ఎల్.కోట వెళ్తున్న కళాశాల బస్సు, కొత్తవలస నుంచి ఎదు రుగా వస్తున్న ఐటీ హిల్స్ బస్సు ఢీకొన్నాయి. ఆ సమయంలో కళాశాల బస్సు డ్రైవర్ చాకచక్యంతో వ్యవహరించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సు వెనుకభాగం నుజ్జయ్యింది. పల వురు విద్యార్థినులకు సీట్లకు ముందు భాగం తగలడంతో గాయాలయ్యాయి. బస్సు ప్రమాదానికి గురైందని తెలుసుకున్న సీఐ కేవీ సతీశ్‌కుమార్ బ్లూకోట్ కానిస్టేబుల్ లెక్కల చంద్రశేఖర్‌ను అప్రమత్తం చేసి, పోలీసు సిబ్బందిని పంపారు. దీంతో వారు వెంటనే అక్కడికి చేరుకుని బస్సులో చిక్కుకున్న విద్యార్థినులను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటనలో గాయపడిన ఐదుగురు విద్యార్థినులను వైద్య సేవల నిమిత్తం గోపాలపట్నంలో గల ఆస్పత్రిలో చేర్పించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినితో మాట్లాడుతున్న పోలీసులు

వినాయక చవితి వేడుకలకు రాటోత్సవం



రాటోత్సవంలో కార్పొరేటర్ లక్ష్మణరావుతో పాటు కమిటీ సభ్యుల

మల్కాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ప్రకాశ్‌నగర్ పోర్టు స్థలంలో వినాయక చవితి వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు సోమవారం పందిరి రాటను వేశారు. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక యువకుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో వార్డు వైసీపీ అధ్యక్షుడు బీశెట్టి గణేశ్, నాయకులు ఆదారి నాగరాజు, మీరా, రామకృష్ణతో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

పెందుర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : అపార్ట్ మెంట్లలో భద్రతకు సీసీ కెమెరాలను విధిగా ఏర్పాటు చేసుకోవాలని క్రైమ్ విభాగం సీఐ ఎన్. శ్రీనివాసరావు సూచించారు. ఇక్కడి జనచైతన్య కాలనీలో గల అపార్ట్‌మెంట్లలో సోమవారం ఏర్పాటైన అవగాహన సదస్సులో మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలకు ఆస్కారం ఉండదన్నారు. అలాగే, నేరాలు జరిగినప్పుడు ఆధారాల సేకరణ సులభతరం అవుతుందని వివరించారు. అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. పనిమనిషి, ఇతర పనివారిని పెట్టుకునేటప్పుడు వారి ఆధార్ కార్డు తీసుకోవాలన్నారు. ఎస్ఐ సూరిబాబు, హెచ్‌సీ నాగరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు

సింధియా, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు కార్మికులు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివి. మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధి ప్రకాశ్‌నగర్‌కు చెందిన సోమాదుల శ్రీనివాస్, ఎర్రయ్య హిందుస్థాన్ షిప్‌యార్డులో కాంట్రాక్ట్ కార్మికులుగా పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం వీరు విధులు ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తుండగా, సింధియా బస్‌స్టాప్ దాటు తున్న సమయంలో వెనుకనుంచి వచ్చిన కారు బలంగా ఢీకొంది. దీంతో ఈ ఇద్దరూ రోడ్డుపై ఎగిరి పడడంతో తీవ్ర గాయాలకు గురయ్యారు. వెం టనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఘటన జరిగిన వెంటనే కారుతో సహా డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. మల్కాపురం సీఐ గొలగాని అప్పారావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు

'ఆదర్శ్'లో ఉత్సాహంగా స్పోర్ట్స్‌మీట్

పెందుర్తి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో సోమవారం మెగా స్పోర్ట్స్ మీట్ ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. తొలుత కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ ఈ మీట్‌ను ప్రారంభించి ప్రసంగించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ఫ్లోరా మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులకు వాలీబాల్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, షటిల్, రన్నింగ్, క్యారమ్స్, చదరంగం పోటీలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



చెస్ పోటీలో తలపడుతున్న విద్యార్థినులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు11 అర్జీలు

వేపగుంట ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పదకొండు అర్జీలు అందాయి. వీటిలో 90వ వార్డు సర్వే నెంబరు 72/6లో స్థలం ఆక్రమణపై చర్యలు చేపట్టాలని, 91వ వార్డు చిన బుచ్చిరాజుపాలెంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని కోరారు. అలాగే, 93వ వార్డు ప్రహ్లాదపురంలో సీసీ రోడ్డు వేయాలని, 94వ వార్డు సేనాతివానిపాలెంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, అదేవిధంగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. 97వ వార్డు చినముషిడివాడలో అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని, పీఎఫ్‌కాలనీలో ముప్పై అడుగుల రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరారు. వీటిని సంబంధిత శాఖలకు పంపించి పరిష్కారానికి చర్యలు చేపడతామని జోనల్ కమిషనర్ కె.హైమావతి తెలిపారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ మార్గం చూపండి

» సంఘం వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వామనమూర్తి

మల్కాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యంపై పునరాలోచన చేయాలని, ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్ల సంఘం వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పేర్కొన్నారు. ఇక్కడి యూనియన్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడారు. ఆర్టీసీ బస్సులలో మహిళలు ఉచిత ప్రయాణం చేయడం వలన ఆటో, వ్యాన్, జీపు, కారు డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇప్పటికే డీజిల్, పెట్రోల్, విడి భాగాల ధరలతో పాటు నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీలు పెరిగిపోవడంతో వీరంతా ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారన్నారు. వీటికి తోడు ఊబర్, ఓలా, రాపిడో వంటి వాటి వలన ఎంత కష్టపడినా కుటుంబాలను పోషించుకో లేకపోతున్నారన్నారు. ఈ తరుణంలో ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 21, 31 రద్దు చేయాలని, థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ రూ.1500 తగ్గించాలని, డీజిల్, పెట్రోల్‌పై జీఎస్టీని రద్దుచేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రావి కృష్ణ, దేవుడు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వామనమూర్తి

రైట్..రైట్!

15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం



» ప్రభుత్వ నిర్ణయం చరిత్రాత్మకమైనదంటున్న మహిళలు

» జిల్లాలో ఉచిత రవాణా సేవలకు సిద్ధంగా 250 ఆర్డినరీ, 60 ఎక్స్‌ప్రెస్, ఐదు పల్లె వెలుగు, 15 ఆల్ట్రా పల్లె వెలుగు బస్సులు

ద్వారకాబస్‌స్టేషన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ఈ నెల 15 నుంచి అమలులోకి రానున్నది. ఇది మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కల్పించిన గొప్ప వరంగా పేర్కొనవచ్చు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెడుతున్న ఈ పథకం చరిత్రాత్మక నిర్ణయంగా అన్ని వర్గాల మహిళలు అభిప్రాయపడుతున్నారు. ఈ పథకం పేద, మధ్యతరగతి వర్గాల మహిళలకు ఆర్థిక ఆసరాగా నిలుస్తుందని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

విశాఖ జిల్లాలో ప్రతిరోజూ సుమారు 1.6 లక్షల మంది మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నట్టు ఆర్టీసీ అధికారుల అంచనా. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు తరువాత ఈ సంఖ్య 1.8 లక్షలకు పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. దినసరి కూలీ పనులకు వెళ్లే మహిళలు, వివిధ రకాల షాపులు, చిన్నచిన్న వ్యాపార సంస్థల్లో చిరుద్యోగాలు చేసే మహిళలు, యువతులు, చిరు వ్యాపారాలు చేసే మహిళలు... ఇలా పేద, మధ్యతరగతి వర్గాల వారికి రవాణా ఖర్చులు లేకుండా ఈ పథకం ఉపయుక్తంగా ఉంటుంది. తద్వారా వారి కుటుంబాలకు ఆర్థికంగా కొంత వెసులుబాటు కలుగుతుందని విద్యావంతులైన మహిళలు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని 250 ఆర్డినరీ సర్వీసులు, 60 ఎక్స్‌ప్రెస్‌లు, 5 పల్లె వెలుగు, 15 ఆల్ట్రా పల్లె వెలుగు బస్సులు ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత రవాణా సేవలందించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఆదాయ, వ్యయాల లెక్కలను పక్కన పెట్టి మహిళలకు నాణ్యమైన, సౌకర్యవంతమైన ఉచిత రవాణా సేవలందించేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు సన్నద్ధమవుతున్నారు.

సాహసోపేత నిర్ణయం



మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం సాహసోపేత నిర్ణయం. ఆదాయం పోతుందన్న యోచన లేకుండా మహిళల ఆర్థిక స్వావలంబనకు కాస్త అండగా ఉండేందుకు సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం మహిళలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పేద, మధ్యతరగతి మహిళలకు ఈ పథకం కొంత ఆర్థిక భరోసాను ఇస్తుంది.

-స్వర్ణశైలజ,
ప్రముఖ కథా రచయిత, మురళీనగర్ వుడా కాలనీ

ఇది మంచి పథకం



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం వల్ల మహిళల గౌరవాన్ని పెంచుతుంది. అత్తెసరు ఆదాయంతో బతికే అనేక కుటుంబాల్లోని మహిళలు ఉద్యోగ, వ్యాపార, కూలి పనుల కోసం వేర్వేరు ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు తమ ఆదాయంలో కొంత రవాణా చార్జీల కింద చెల్లించాల్సి వస్తుంది. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించడం ఎంతో మందికి ఉపయుక్తంగా ఉంటుంది. ప్రభుత్వం అమలు చేసున్న మంచి సంక్షేమ పథకం ఇది.

-జి.కన్యాకుమారి,
స్పెక్ట్ కార్యవర్గ సభ్యురాలు, ఎంవీపీకాలనీ

చిరుద్యోగులకు వరం



చిరుద్యోగాలు చేసే యువతులు, మహిళలు తమ సంపాదనలో కొంత రవాణా ఖర్చులకే వెచ్చిస్తున్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలు తరువాత ఈ ఖర్చుల బాధ ఉండదు. ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకోవచ్చు. దూర ప్రాంతాలకు కూలి పనులకు వెళ్లే మహిళా కార్మికులు తమ రోజువారీ సంపాదనలో చాలావరకు రవాణా చార్జీలకే ఖర్చు చేసేవారు. ఈ నెల 15 తరువాత వారికి రవాణా చార్జీలు మిగులుతాయి కాబట్టి ఆర్థికంగా కాస్త ఇబ్బందులు తగ్గుతాయి.

- ఎంవీఎన్ సుశీల,
ప్రధానోపాధ్యాయిని, దుర్గవానిపాలెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

పొదుపు చేసేందుకు అవకాశం



ఉచిత బస్సు పథకం వల్ల పేద, మధ్యతరగతి మహిళలు తమ రవాణా చార్జీలకయ్యే మొత్తాన్ని పొదుపు చేసుకునే అవకాశం కలుగుతుంది. ప్రయాణాల సమయంలో ప్రైవేటు వాహనాల డ్రైవర్లతో బేరమాడే అవసరం ఉండదు. ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు రవాణా పథకం ఆర్థిక భరోసాను ఇస్తుంది. ఆదాయం సంగతి పక్కనపెట్టి ప్రభుత్వం ఈ పథకం అమలు చేయడం ఎంతో ఆనందంగా ఉంది.

-పి.వెంకటపద్మశ్రీ, గృహిణి, బాజీ జంక్షన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 313 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

మహారాణిపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పదేపదే వచ్చే అర్జీలను లోతుగా పరిశీలించి పరి ష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేందిర ప్రసాద్ ఆదే శించారు. కలెక్టరేట్‌లో సోమవారం అర్జీదారుల నుంచి 313 వినతులను స్వీకరించారు వీటిలో రెవెన్యూ విభాగానికి 130, జీవీఎంసీ 82, పోలీసు విభాగానికి 15, ఇతర విభాగాలకు 86 ఉన్నాయన్నారు. అనంతరం అధికారులతో సమీక్షించి మార్గదర్శకాలను జారీ చేశారు. వినతులపై క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించాలని ఆన్‌లైన్‌లో వచ్చిన ఫిర్యాదులను కూడా పరిశీలించాలన్నారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జీవీఎంసీకి 113 వినతులు

వెంకోజీపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 113 వినతులు వచ్చాయని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి వినతులు స్వీకరించారు. విభాగాధిపతులు వాటిని పరిశీలించి, గడువులోగా పరిష్కరించాలని, ఆదేశించారు.

పోలీసు కమిషనరేట్‌కు 105 పిర్యాదులు

మహారాణిపేట, ఆగసు 11 (ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు 105 పిర్యాదులు వచ్చాయి. సీపీ డా.శంఖబ్రతబాగ్చి వాటిని స్వీకరించారు. బాధితుల సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి, చట్టపరంగా చర్యలు తీసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.

స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు

» సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రతిబింబించేలా శకటాలు, స్టాళ్లను రూపొందించాలి

» అధికారులకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లుచేయాలని, అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఆగస్టు 15న పోలీస్ పరేడ్ మైదానంలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఆయన సమీక్షించారు. వేడుకలకు జిల్లా ప్రజలు, స్వాతంత్ర్య సమరయోధులు, ఇతర ప్రముఖులు ఆహ్వానితులేనని పేర్కొన్నారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. నిస్టేజ్ అలంకరణ, సీట్ల ఏర్పాటు, సౌండ్ సిస్టమ్, మైదానంలో అవసరమైన మరమ్మతులు చేపట్టేప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పైలెట్ వాహనాలు, శకటాలకు వినియోగించే వాహనాలకు ఫిట్‌నెస్ తనిఖీ చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీటిని కల్పించే బాధ్యత జీవీఎంసీ చూసుకోవాలన్నారు. పోలీస్, ఎన్‌సీసీ విభాగాల నుంచి గౌరవ వందనం పరేడ్ ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయంలేకుండా చూడాలని, ఫైర్‌సేఫ్టీ ప్రమాణాలు సరిచూసుకోవాలన్నారు.

సంక్షేమం చాటిచెప్పేలా శకటాలు, స్టాళ్లు..

ప్రభుత్వం అమలుచేసే సంక్షేమం, అభివృద్ధి పథకాలు ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన నిర్వహించాలని, స్టాళ్లు ఏర్పాటుచేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర, యూసీడీ ద్వారా అమలుచేస్తున్న సంక్షేమ ఫలాలు, ఇతర కార్యకలాపాలు తెలుపుతూ జీవీఎంసీ, మాస్టర్ ప్లాన్ -2041లో భాగంగా అభివృద్ధి ప్రాజెక్టులపై వీఎంఆర్‌డీఏ, తల్లికి వందనం, మధ్యాహ్న భోజనం, ఇతర విద్యాకలాపాలపై విద్యాశాఖ శకటం రూపొందించాలన్నారు. పీ-4పై ప్రణాళికశాఖ, పర్యాటక, వైద్య ఆరోగ్యశాఖలు శకటాలు, ఐసీడీఎస్, యూసీడీ, డీఆర్‌డీఏ, వ్యవసాయం, మత్స్యశాఖ ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. వివిధ పథకాల లబ్ధిదారులకు నగదు పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు.

బీజేపీకి ఏజెంట్‌గా మారిన ఎన్నికల సంఘం

» కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటవర్మరాజు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణుల నిరసన

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బీజేపీకి ఎన్నికల సంఘం ఏజెంట్‌గా మారిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అడ్డాల వెంకటవర్మ రాజు విమర్శించారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అరెస్టును ఖండిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జ్‌లు ధరించి నిరసన తెలిపారు. రాహుల్ గాంధీ బయటపెట్టిన నిప్పులాంటి నిజాలపై సమాధానం చెప్పే దమ్ములేక డిక్లరేషన్ అంటూ వెనుకుండి నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు పునాది అని, అటువంటి పునాదులను నాశనం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దొంగ ఓట్ల చేరికతో వ్యవస్థ భ్రష్టు పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.రాహుల్ గాంధీ అరెస్టు దారుణమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహేష్, తూర్పు ఇన్‌చార్జ్ ప్రియాంక, శివ కుమార్, భీమిలి ఇన్‌చార్జ్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమెరికన్ చెస్ యువజన పోటీల్లో దేవాన్ష్ ప్రతిభ



ప్రతిభ చూపిన దేవాన్ష్ వెల్లంకి

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో ఇటీవల జరిగిన 35వ పాన్-అమెరికన్ చెస్ యువజనోత్సవాలు -25 లో పాల్గొన్న ఎనిమిదేళ్ల దేవాన్ష్ వెల్లంకి ప్రపంచ చెస్ సమాఖ్య (ఫైడ్) టైటిల్‌ను సాధించాడు. జులై 27 నుంచి ఆగస్టు 3వరకు ఉత్తర, మధ్య దక్షిణ అమెరికాలో జరిగిన ఈ ఉత్సవాల్లో 25కు పైగా దేశాల చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. అమెరికా తరపున పాల్గొన్న దేవాన్ష్ యు08 విభాగం క్లాసికల్ చెస్‌లో స్వర్ణం, బ్లిట్జ్ చెస్‌లో వెండి, రాపిడ్ చెస్‌లో కాంస్య పతకాలు సాధించాడు. దీంతో పాటు ప్రపంచ చెస్ సమాఖ్య నుంచి ప్రతిష్ఠాత్మక కేండిడేట్ మాస్టర్ టైటిల్ లభించింది. చెస్‌లో అద్భుత ప్రతిభ ప్రదర్శించిన వారికి ఇది అంతర్జాతీయ గౌరవం. చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన దేవాన్ష్ మరెన్నో గొప్ప విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన అరుణ్‌కుమార్ వెల్లంకి, హరిణి చదలవాడ దంపతులు అమెరికాలోని ఐటీ ఉద్యోగాలు చేస్తున్నారు. వీరికి అమెరికన్ పౌరసత్వం ఉంది. విశాఖలోని ప్రముఖ చెస్‌ప్లేయర్ చిరంజీవి నుంచి ఆన్‌లైన్ క్లాసుల ద్వారా దేవాన్ష్ చెస్ నేర్చుకున్నాడు.

తొలగించిన విశాఖ డెయిరీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

» 24 గంటల నిరాహార దీక్షలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్



సోమవారం రాత్రి ధర్నా శిబిరంలో నిద్రపోతున్న కార్మికులు

సిరిపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): విశాఖ డెయిరీలో తొలగించిన 305 మంది కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద 24 గంటల నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ మాట్లాడుతూ దశాబ్దాలుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచడం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సదుపాయాలు కల్పించాల్సిన యాజమాన్యం, వారిని తొలగించడం చట్ట విరుద్ధమన్నారు. విధుల్లో ఉన్న వారిని తొలగించి, కొత్త వారిని నియమించడం దారుణమన్నారు. డెయిరీ కార్మికులు ఒంటరిగా లేరని వారికి కార్మికవర్గం అండగా ఉందన్నారు. తొలగించిన వారందరినీ విధులకుతీసుకోవాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాత్రంతా శిబిరం వద్ద నిరసన తెలియజేస్తామన్నారు. సీఐటీయూజిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల శ్రమను దోచుకొని డెయిరా భారీ లాభాలను పొందుతోందన్నారు. కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ఎం.రాంబాబు, వివిధ సంఘాల నాయకులు పి.మణి, జగ్గునాయుడు, కె.సత్యనారాయణ, కృష్ణారావు తదితరులు సంఘీభావం తెలిపారు.

క్రైం... crime news

చోరీ కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

» ఐదున్నర తులాల బంగారం స్వాధీనం చేసుకున్న పోలీసులు



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఎన్.శ్రీనివాసరావు

గోపాలపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ చేసిన ముగ్గురు నిందితుల్ని గోపాలపట్నం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను వెస్ట్ సబ్‌డివిజన్ క్రైం సీఐ ఎన్.శ్రీనివాసరావు వెల్లడించారు. లక్ష్మీనగర్‌కు చెందిన యరబాల నారాయణరావు ఈ నెల 9న కుటుంబ సమేతంగా శ్రీకాకుళంపెళ్లికి వెళ్లాడు. తిరిగి 10న వచ్చి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎన్.శ్రీనివాసరావు, ఎస్ఐ తేజేశ్వరరావు బృందం దర్యాప్తు చేశారు. నారాయణరావు ఇంటి సమీపంలోనే నివశిస్తున్న బోగాది అప్పలనాయుడు(54)పై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదుదారుడు చెప్పడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా కొత్తపల్లి జయరామ్(26), ఈత ఇంద్ర (24)తో కలిసి చోరీ చేసినట్టు అంగీకరించాడు. దీంతో ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి ఐదున్నర తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన 24 గంటల్లో నిందితులను అరెస్టు చేసి, సొత్తును రికవరీ చేసిన సిబ్బందిని సీఐ అభినందించారు.

17 సెల్‌ఫోన్‌లు స్వాధీనం

వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన 17 సెల్‌ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి కేసులు ఛేదించామని సీఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు.

వ్యాన్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

» ఆరు ఆవులకు తీవ్ర గాయాలు



మృతిచెందిన వ్యక్తి

ఆరిలోవ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వ్యాన్ ఢీకొనడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన హనుమంతవాక కూడలిలో సోమవారం వేకువజామున జరిగింది. ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు... శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట నుంచి పూర్ణామార్కెట్‌కు గోవులతో వస్తున్న వ్యాన్ హనుమంతువాక కూడలిలో రోడ్డు పక్కన నడిచి వెళ్తున్న వ్యక్తిని అతివేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. వ్యాన్ బోల్తా పడడంతో అందులోని ఆరు ఆవులు తీవ్రంగా గాయపడ్డాయి. వ్యాన్ డ్రైవర్ రాంబాబును అదుపులోకి తీసుకుని, గోవుల అక్రమ రవాణా, వ్యక్తి మృతికి కారకుడిగా రెండు కేసులు నమోదుచేశామన్నారు. ఆవులకు పశువైద్యులతో చికిత్స చేయించామని, వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

సాయిరామ్ పార్లర్‌లో రూ.2.8 లక్షలు చోరీ

» గంటల వ్యవధిలో నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు

సీతంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డైమండ్ పార్కు సమీపంలో గల సాయిరామ్ పార్లర్‌లో పనిచేస్తున్న ఒక వ్యక్తి పార్లర్‌లో ఉంచిన సొమ్మును దోచుకొని పారిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... పార్లర్‌లో దేవతోటి కిరణ్ (24) పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పని ముగిసిన అనంతరం క్యాష్ సూపర్‌వైజర్ బోని రాము రూ.2.8 లక్షలు కబోర్డులో పెట్టి తాళం వేసి, తాళం చెవి అక్కడే ఉంచి వెళ్లిపోయాడు. ఇది గమనించిన కిరణ్ తాళం తీసి డబ్బుతో పారిపోయాడు. ఉదయం చూసేసరికి డబ్బు కనిపించకపోవడంతో రాము నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మహ్మద్ సల్మాన్ బేగ్ సీసీ కెమెరాలను పరిశీలించి, చోరీకి పాల్పడింది దేవతోటి కిరణ్‌గా గుర్తించారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, ఏలూరు జిల్లా తాడేపల్లిగూడెంలో నిందితుడ్ని పట్టుకున్నారు. చోరీ సొత్తు రూ.2.8 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. గంటల వ్యవధిలోనే దొంగను పట్టుకోవడంతో సాయిరామ్ పార్లర్ యాజమాన్యం పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురి అరెస్టు

4 కిలోల గంజాయి, 2 ద్విచక్ర వాహనాలు, 2 సెల్ ఫోన్లు స్వాధీనం



పోలీసులు అరెస్టు చేసిన నాని, రాజేశ్, నితీశ్

గాజువాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గంజాయిని రవాణా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను గాజువాక పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంజాయి రవాణా చేస్తున్నారన్న ముందస్తు సమాచారంతో ఎస్ఐ ఎల్.సూర్యకళ జింక్ మైదానం వద్ద గస్తీ చేపట్టి రెండు ద్విచక్ర వాహనాలపై వస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. దువ్వాడ ప్రాంతానికి చెందిన తిలపాల నాని (24), గాజువాక డిపో ప్రాంతానికి చెందిన జడ్డా రాజేశ్ (23), ములగాడకు చెందిన గురజాపు నితీశ్ (23)లు అరకు నుంచి గాజువాకకు నాలుగు కిలోల గంజాయిని తీసుకువస్తుండగా పట్టుకున్నారు. వీరివద్ద నుంచి గంజాయితో పాటు రెండు ద్విచక్ర వాహనాలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరు అరకు నుంచి గంజాయిని కొనుగోలు చేసి గాజువాక ప్రాంతంలో అధిక ధరలకు విక్రయించేవారని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వర్షాభావం తీవ్రం

... 5వ పేజీ తరువాయి

వరకూ జిల్లాలోని 11 మండలాల్లో 300.9 మి.మీ.లు వర్షపాతానికిగాను 184 మి.మీ. (38.9 శాతం తక్కువ) వర్షపాతం నమోదైంది. వర్షాలు లేకపోవడంతో జిల్లాలో ఖరీఫ్ సాగుపై ప్రభావం చూపింది. బోర్ల కింద మాత్రమే వరి సాగు చేస్తుండగా చెరువులపై ఆధారపడిన పొలాల్లో నాట్లు పడలేదు. మెట్టపంటల సాగు కూడా లక్ష్యాల మేర సాగలేదు. వర్షాభావంతో నగరంలో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగింది. పీఎం పాలెం, మధురవాడ, ఆరిలోవల్లో ఇప్పటికే కొన్నిచోట్ల బోర్లు ఎండిపోయాయి. మరికొన్నిచోట్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో అపార్టుమెంట్లలో ఉండే వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నరు. జిల్లాలో నైరుతి రుతుపవనాల సీజన్‌లో 5,406 హెక్టార్లకుగాను 1,275 హెక్టార్లలో (23.6 శాతం) మాత్రమే పంటల సాగు అయింది. 4,696 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం కాగా 878 హెక్టార్ల (18.7శాతం) పడ్డాయి. నూనె గింజల పంట 522 హెక్టార్లకుగాను 323 హెక్టార్లు (61.3 శాతం) లో సాగుచేశారు. కాగా ఈనెల 13వ తేదీన ఉత్తరకోస్తాకు ఆనుకుని బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనంపై రైతులు, ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

నేడు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా మంగళవారం నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నట్టు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు, ఆర్‌బీఎస్‌కే కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.హారిక తెలిపారు. జిల్లాలోని ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వయసుగల అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, పాఠశాలలకు వెళ్లని వారికి, కౌమార బాలబాలికలకు మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 5,15,264 మంది చిన్నారులున్నారని, ఏడాది నుంచి రెండేళ్లలోపు వయసున్న వారికి సగం మాత్రను నీటిలో కరిగించి తాగించాలని, రెండేళ్ల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు పూర్తి మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. మూడేళ్ల నుంచి 19 ఏళ్లలోపు చిన్నారులు పూర్తి మాత్రను చప్పరించేలా చూడాలన్నారు. మధ్యాహ్న భోజనం చేసిన అర్ధ గంట తరువాత వేయాలన్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. మంగళవారం మాత్రలు తీసుకోని వారు ఈ నెల 20న నిర్వహించే మాప్ అప్ రౌండ్‌లో తీసుకోవాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యాశాఖ, మహిళాభివృద్ధి శిశు సంక్షేమశాఖ, ఇతర శాఖల సహకారంతో కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.